PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 5 | విజయవాడ, సోమవారం 5 ఆగస్టు 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 5 August 2024 | Rs

రేయింబవళ్లు సహాయక చర్యలు

- నిర్విరామంగా వెయ్యి మంది పైగా అధికారుల సేవలు
- ట్రక్ డ్రైవర్ కుటుంబానికి సిఎం పరామర్శ

5



ఒలింపిక్ సెమీస్‌లో హాకీ ఇండియా

- క్వార్టర్ ఫైనల్లో బ్రిటన్‌పై సంచలన విజయం
- షూటౌట్‌లో 4-2 గోల్స్ తేడాతో గెలుపు
- రేపే సెమీఫైనల్

పారిస్ ఒలింపిక్స్ హాకీ క్వార్టర్‌ఫైనల్. అగ్రజట్టు గ్రేట్ బ్రిటన్‌తో హాకీ ఇండియా అమీతుమీ. హాకీలో రెడ్ కార్డ్ అత్యంత అరుదు. అటువంటిది స్టార్ డిఫెండర్ అమిత్ రోహిదాస్ రెడ్‌కార్డ్‌తో దాదాపుగా మూడు క్వార్టర్ల ఆటకు దూరమయ్యాడు. గోల్స్ వేటలో దూకుడుగా ఆడే బ్రిటన్‌తో పది మందితో కూడిన టీమ్ ఇండియా అప్రతిహత విజయం సాధించింది. డిఫెన్స్‌లో గత రెండు దశాబ్దాల్లోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత్.. పారిస్ ఒలింపిక్స్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. ఉత్కంఠభరిత షూటౌట్‌లో బ్రిటన్‌పై 4-2తో విజయం సాధించింది. ఇక్కడ్నుంచి భారత్ కనీసం ఒక్క విజయం సాధించినా.. పారిస్ ఒలింపిక్స్‌లో పతకం ఖాయమే!.

ఆరో పేజీలో..

ఆశాజనకంగా లేని ఖరీఫ్

- జులై నాటికి 10 లక్షల ఎకరాలు తగ్గుదల
- అదను తప్పిన వేరుశనగ, పత్తి
- వర్షాలున్నా వెనక్కే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఖరీఫ్ సీజన్ మధ్యకొచ్చినా పంటల సాగులో పురోగతి అంత ఆశాజనకంగా ఏమీ లేదు. ఒకటీఅరా తప్ప దాదాపు అన్ని పంటలూ జులై నెలాఖరునాటికి సాగు కావాల్సిన దానికంటే తక్కువే సాగయ్యాయి. ఈపాటికి కావాల్సిన సాగులో సుమారు పది లక్షల ఎకరాల తగ్గుదల కనిపిస్తోంది. నిరుడు తీవ్ర కరువు వలన సేద్యం అంతంతమాత్రంగా జరిగింది. ఈ సంవత్సరం వర్షాలు ఒక మేరకు బాగానే కురిసినా అందుకు తగ్గట్టు పంటల సాగు లేదు. ఇప్పటికి చూస్తే తక్కువ వర్షం కురిసిన జిల్లా ఒక్కటీ లేదు. అన్నింటిలోనూ సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతమే నమోదైంది. అయితే ఇవి సాంకేతిక లెక్కలే. ఒకేసారి భారీ వర్షాలు కురిసి ఆ తర్వాత సరైన వానల్లేని మండలాలు బాగానే ఉన్నాయి. అందుకు రాయలసీమ జిల్లాలే ఉదాహరణ. అనంతపురం, శ్రీసత్యసాయి తదితర జిల్లాల్లో జూన్‌లో అత్యధిక వర్షాలు పడ్డాయి. జులైలోకొచ్చేసరికి వానలు వెనకపట్టు పట్టాయి. దాంతో పంటల సాగుకు పరిస్థితులు అనుకూలంగా లేవు. ఈ కారణంగా వేరుశనగ, ఇతర మెట్ట పంటల సాగు దాదాపు నిలిచిపోయింది. అంతకుముందు కురిసిన వర్షాలకు వేసిన పంటలు ఎండుతున్నాయి. ఉత్తరాంధ్రలో శ్రీకాకుళంతో పాటు కొన్ని చోట్ల పరిస్థితి ఈ రకంగానే ఉంది. మొన్నటి వరకు కృష్ణా డెల్టాను నీటి గండం వెంటాడింది. పట్టిసీమ నీరు కొద్దికొద్దిగా ఇచ్చారు. ప్రస్తుతం కృష్ణానదికి ఎగువ నుంచి వరద రావడంతో అడుగంటిన శ్రీశైలం నిండింది. వరద అదే తీరుగా నాలుగైదు రోజులు ఉంటే నాగార్జునసాగర్ కూడా నిండుతుంది. కిందనున్న పులిచింతల కూడా నిండుతుంది. ఈ పరిస్థితులతో కృష్ణా డెల్టాకు నీటి సమస్య సమసిపోతుందని అంచనా వేస్తున్నారు. అయితే సాగు ఇప్పటికీ పుంజుకోలేదు. నాట్లు బాగా ఆలస్యమయ్యాయి. ఆ మేరకు దిగుబడుల నష్టం ఉంటుందని చెబుతున్నారు. తుపాన్లు, వాయుగుండాల భయం సైతం రైతులను వేధిస్తోంది.

సాగు 40 శాతమే!

జూన్ 1 నుంచి జులై నెలాఖరు నాటికి రాష్ట్ర సాధారణ వర్షపాతం 254.7 మిల్లీమీటర్లు కాగా, 333.9 మిమీ కురిసింది. నార్మల్‌లో 31.1 శాతం వర్షం పడింది. ఏలూరు జిల్లాలో అత్యధిక వర్షం పడగా, శ్రీకాకుళం, మన్యం, పల్నాడు, కర్నూలు, కడప, ప్రకాశం జిల్లాల్లో నార్మల్ వర్షం పడింది. తతిమ్మా 19 జిల్లాల్లో ఎక్కువ వర్షం కురిసింది. ఖరీఫ్‌లో అన్ని పంటలూ కలుపుకొని 81 లక్షల ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా, 32.32 లక్షల ఎకరాల్లోనే సాగయ్యాయి. నార్మల్‌లో 41 శాతం సాగయ్యాయి. జులై చివరికి 43.40 లక్షల ఎకరాలు (75 శాతం) సాగు కావాలి. నిరుడు తీవ్ర వర్షాభావంలో ఎంత విస్తీర్ణంలో సేద్యం జరిగిందో ఈయేడు ఇప్పటి వరకు దాదాపు అంతే విస్తీర్ణంలో సేద్యం జరిగింది. ఆహార ధాన్యాలు సీజన్ నార్మల్‌లో 41 శాతం సాగు కాగా, ఈపాటికి కావాల్సిన సాగులో 95 శాతం సాగయ్యాయి. తృణధాన్యాలు సీజన్ నార్మల్‌లో 57 శాతం, పప్పుధాన్యాలు 38 శాతం, నూనెగింజలు 37 శాతం సాగయ్యాయి. మామూలుగా ఖరీఫ్‌లో కందులు ఎక్కువగా సాగవుతాయి. కానీ ఆ పంట కూడా పెద్దగా లేదు.

బాగా తక్కువ

వేరుశనగ సాగు బాగా తగ్గింది. తొలకరి వర్షాలకు ఆ పంటను రాయలసీమలో వేస్తారు. అనంతపురంలో ఇప్పటికి 21 శాతమే సాగైంది. శ్రీసత్యసాయి జిల్లాలో 47 శాతం సాగైంది. తతిమ్మా జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి. వర్షాలు పడితే అడపాదడపా వేయడం తప్ప ఇక వేరుశనగను విస్తారంగా రైతులు సాగు చేయరు. వేరుశనగకు ప్రత్యామ్నాయంగా కందులు, పత్తి, ఆముదాలు వేస్తారనుకుంటే వాటి సాగు కూడా అంతంతమాత్రంగానే ఉంది. వాణిజ్యపంట పత్తి సైతం ఈ ఏడాది తగ్గింది.

జులై 31 నాటికి సాగు (లక్షల ఎకరాల్లో)

పంట	నార్మల్ సాగు	జులై 31 నాటికి కావాల్సిన సాగు	సాగైంది
వరి	37.8	15.75	14.82
తృణధాన్యాలు	4.85	2.67	2.77
పప్పుధాన్యాలు	7.42	2.97	2.80
ఆహారధాన్యాలు	50.02	21.37	20.40
నూనెగింజలు	15.30	11.05	5.62
వేరుశనగ	13.87	10.22	4.87
పత్తి	14.47	9.87	5.90
మొత్తం పంటలు	**81.00**	**43.40**	**32.32**

నేడు కలెక్టర్ల కాన్ఫరెన్స్

- కీలక అంశాలపై సిఎం సమీక్ష

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

26 జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. సచివాలయం ఐదో బ్లాక్ మొదటి అంతస్తులోని కాన్ఫరెన్స్ హాలులో ఉదయం పది గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు పలు కీలక అంశాలపై సమీక్షించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా భూ కుంభకోణాల గురించి పెద్దయెత్తున వినతులు అందుతున్న నేపథ్యంలో లెక్కలు తేల్చి బాధ్యులకు న్యాయం చేసేందుకు వీలుగా జిల్లాల వారీ ప్రత్యేక అధికారులను నియమించే అంశంపై సమీక్షలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుంది. శాంతి భద్రతలు, రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు ఏర్పాటుకు ఆయా జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులు, భూముల లభ్యత గురించి నివేదికలు కోరనున్నట్లు సమాచారం. కీలకమైన ఈ సమావేశానికి సంబంధించి ప్రభుత్వం ఆదివారం షెడ్యూల్ వెల్లడించింది. సోమవారం ఉదయం పది గంటలకు సమావేశం ప్రారంభం కానుంది. రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ప్రారంభోపన్యాసం చేస్తారు. అనంతరం డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ కలెక్టర్లనుద్దేశించి మాట్లాడతారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెవెన్యూలో తీసుకురానున్న మార్పులు, చట్టాల సవరణ, భూముల రీ సర్వే, భూ ఆక్రమణలు తదితర అంశాలపై ప్రసంగించనున్నారు. అనంతరం వివిధ శాఖలపై సమీక్షలు చేయనున్నారు. అధికారులు పలు అంశాలపై ప్రెజెంటేషన్లు ఇవ్వనున్నారు. లా అండ్ ఆర్డర్‌పై డిజిపి ద్వారకా తిరుమలరావు మాట్లాడనున్నారు. చివర్లో సిఎం చంద్రబాబు ముగింపు ప్రసంగం ఉంటుంది. ఓట్ ఆఫ్ థ్యాంక్స్, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా ప్రసంగంతో కాన్ఫరెన్స్ ముగియనుంది.

కోర్బా ఎక్స్‌ప్రెస్‌లో ఎసి కోచ్‌లు దగ్ధం


విశాఖ స్టేషన్‌లో ఘటన • షార్ట్ సర్క్యూట్ కారణం : అధికారులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

విశాఖ రైల్వే స్టేషన్‌లో ఆదివారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. కోర్బా - విశాఖపట్నం (18517) కోర్బా ఎక్స్‌ప్రెస్ ఉదయం 6.20 గంటలకు విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లోని 4వ నెంబర్ ఫ్లాట్ ఫామ్‌నకు చేరుకుంది. ప్రయాణికులు అందరూ దిగి వెళ్లిపోయారు. రైలు ప్లాట్‌ఫామ్‌పైనే ఉంది. ఉదయం 9:30 గంటలకు రైలులోని బి8 ఎసి కోచ్‌లో మంటలు ప్రారంభమై బి6, బి7, ఎం1 కోచ్‌లకు వేగంగా వ్యాపించాయి. ఈ ప్రమాదంలో బి7 కోచ్ పూర్తిగా దగ్ధం కాగా.. బి8, బి6, ఎం1 కోచ్‌లు 70 శాతం కాలిపోయాయి. స్టేషన్‌లో రైలు ఆగి ఉన్న సమయంలో ప్రమాదం సంభవించడంతో ప్రాణ నష్టం తప్పింది. సకాలంలో స్పందించిన విశాఖపట్నం సిటీ పోలీసులు, జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్, అగ్నిమాపక సిబ్బంది నాలుగు ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సంఘటన స్థలానికి విశాఖపట్నం సిటీ జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఫకీరప్ప, డిఆర్ఎం సౌరవ్‌ప్రసాద్ చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదానికి ఎసి యూనిట్‌లో షార్ట్ సర్క్యూట్ కారణమని ప్రాథమిక విచారణలో అధికారులు తెలిపారు. రైల్వే పోలీసులు (జిఆర్‌పి) కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ప్రమాదం కారణంగా ఇతర రైళ్ల సేవలపై ప్రభావితం కాకుండా అధికారులు చర్యలు చేపట్టారు. కాలిపోయిన కోచ్‌ల స్థానంలో ప్రత్యామ్నాయ కోచ్‌లను ఏర్పాటు చేశారు. విశాఖపట్నం - కడప (17488) ఎక్స్‌ప్రెస్ నిర్ణీత సమయానికే విశాఖపట్నం నుంచి బయలుదేరింది.



దగ్ధమవుతున్న బోగీ



వయనాడ్ బాధితులకు అండగా... చిరంజీవి, రామ్‌చరణ్ కోటి విరాళం

- రూ.25 లక్షలు ప్రకటించిన అల్లు అర్జున్

ప్రజాశక్తి-హైదరాబాద్

కేరళలోని వయనాడ్ బాధితులను ఆదుకునేందుకు తెలుగు చిత్రసీమ సైతం మేం ఉన్నామంటూ అండగా నిలబడుతోంది. ఇందులో భాగంగా చిరంజీవి మరోమారు తన మంచి మనసుని చాటుకున్నారు. ఇప్పుడు కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడి వందలాది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. చాలా మంది సాయం కోసం ఎదురు చూస్తున్నారు. కేరళ ప్రభు త్వానికి సినీ రంగానికి చెందిన పలువురు ప్రముఖు లు ఇప్పటికే తమ మద్దతు తెలియజేసిన సంగతి తెలిసిందే. తాజాగా చిరంజీవి, ఆయన తనయుడు రామ్‌చరణ్ కలిసి వయనాడ్ బాధితుల కోసం కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించారు. 'వయనాడ్ జిల్లాలో ప్రాణాలు కోల్పోయిన వారి విషయంలో నా గుండె తరుక్కుపోతుంది. బాధితులు కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అంటూ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా సానుభూతిని ప్రకటించారు.

హీరో అల్లు అర్జున్ కూడా నేను సైతం.. అంటూ తన మంచి మనసుని మరోమారు చాటుకున్నారు. వయనాడ్ బాధితులకు తన వంతుగా రూ.25 లక్షలను కేరళ సిఎం సహాయనిధికి విరాళంగా ప్రకటించారు. ఇప్ప టికే కమల్‌హాసన్ రూ.25 లక్షలు, విక్రమ్ రూ.20 లక్షలు, రష్మిక రూ.10 లక్షలు, హీరో సూర్య, ఆయన భార్య జ్యోతిక, సూర్య సోదరుడు కార్తి సంయుక్తంగా రూ.50 లక్షలు, నయనతార, విఘ్నేశ్ శివన్ దంపతులు మిగతా 2లో

వయనాడ్ బాధితులకు సాయం

- సిపిఎం ఆధ్వర్యాన విరాళాల సేకరణ

2

వైసిపి కార్యకర్త దారుణ హత్య

- రాజకీయ కక్షతోనే చంపేశారు : మృతుడి భార్య సుబ్బమ్మ
- టిడిపి నాయకులను పోలీసులు అడ్డుకోలేదని గ్రామస్తుల విమర్శలు

3

యువతిపై ఉన్మాది దాడి


2

నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూపులు

- రేపోమాపో అంటూ సాగదీత
- అసంతృప్తిలో 'అధికార పార్టీ' నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పదవుల కోసం టిడిపి కూటమి నేతలు ఎదురుచూస్తున్నారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడిచినా.. ఇప్పటికీ ఒక్క పోస్టు కూడా భర్తీ కాలేదు. రేపోమాపో అంటూ సాగదీయటంతో కొంతమంది నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నామినేటెడ్ పోస్టుల కోసం చూస్తున్న ఆశావహులు తమ బయోడేటాను పార్టీ కార్యాలయంలోని ప్రోగ్రామ్స్ కమిటీకి అందించాలని టిడిపి అధిష్టానం నెలన్నర క్రితం ఆ పార్టీ నాయకులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రోగ్రామ్స్ కమిటీ నాయకుల నుంచి బయోడేటా, దరఖాస్తులు స్వీకరిస్తోంది. ప్రోగ్రామ్స్ కమిటీకి వచ్చిన బయోడేటాల పరిశీలన కార్యక్రమం టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలోనే జరుగుతోంది. దీంతో ఎవరికి ఏ పదవి వస్తుంది? ఎప్పుడు భర్తీ చేస్తారనే అంశం మిగిలిన నేతలకు తెలియడం లేదు. నామినేటెడ్ పోస్టుల ఖాళీల వివరాలను సాధారణ పరిపాలనశాఖ అన్ని శాఖల నుంచి సమాచారం జులై మొదటి వారంలో తెప్పించుకుంది. రాష్ట్రంలో పోలీస్ శాఖలోని డిఎస్‌పి, సిఐలతోపాటు, ఇతర శాఖల్లో కూడా అధికారుల బదిలీలు జరుగుతున్నాయి. ఈ పోస్టులు ఎమ్మెల్యేల ఇష్ట ప్రకారమే జరుగుతున్నాయని, పదవి లేకపోవడంతో తాము ఏమీ చేయలేకపోతున్నామని శనివారం టిడిపి నేత బుద్ధా వెంకన్న బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. బుద్ధా వెంకన్న వంటి నేతలు పార్టీలో మరికొందరు ఉన్నారని, అయితే వారు బయటపడటం లేదనే చర్చ టిడిపిలో నడుస్తోంది.



గ్రీవెన్స్‌లో అధికులు ఆశావహులే!


టిడిపి కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు, పార్టీ నేతలు నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమంలో నామినేటెడ్ ఆశావహుల దరఖాస్తులే ఎక్కువగా ఉంటున్నాయనే చర్చ టిడిపిలో జరుగుతోంది. గత ప్రభుత్వంలో ఇబ్బందులు పడ్డ కార్యకర్తలు, ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రజావేదిక పేరుతో ఈ గ్రీవెన్స్ కార్యక్రమం మొదలుపెట్టారు. సమస్యలు చెప్పుకునేందుకు ఎంతమంది వస్తున్నారో అంతే సంఖ్యలో పదవుల కోసమూ వస్తున్నారు. దీంతో గ్రీవెన్స్ కోసం వస్తున్న వారితో పార్టీ కార్యాలయం కిక్కిరిసిపోతుందని నేతలు భావిస్తున్నారు. ప్రతి శనివారం ముఖ్యమంత్రి వచ్చే సమయంలో వస్తున్న ప్రజలను భద్రతా సిబ్బంది నియంత్రించలేకపోతోంది. ముఖ్యమంత్రి కూడా గంటల తరబడి నిలబడే వారి నుంచి వినతులు స్వీకరిస్తున్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ జరిగితే పార్టీ కార్యాలయానికి వచ్చే నేతలు, ప్రజలు తగ్గుతారని నేతలు భావిస్తున్నారు.

సీనియర్లు చూపు 'నామినేటెడ్' వైపే..

టిడిపిలో సీనియర్ నేతలు సైతం కార్పొరేషన్ ఛైర్మన్ పోస్టులను ఆశిస్తున్నారు. ఎన్నికల సమయంలో పొత్తులో భాగంగా టికెట్లు మిగతా 2లో

రైతుల బతుకులు బుగ్గి!

- 350 ఎకరాల్లో బూడిద మేటలు
- వ్యవసాయం అనుమానమే
- ఎపి జెన్‌కో అధికారుల నిర్లక్ష్య ఫలితం



నేలటూరులో బూడిద మేటలు వేసిన పొలాలు, రొయ్యల గుంటలు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి, యంత్రాంగం

కృష్ణపట్నం పోర్టు పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే థర్మల్ ప్రాజెక్టుల నిర్మాణానికి రైతులు వేలాది ఎకరాలు అప్పగించారు. థర్మల్ ప్లాంట్ల నుంచి వెలువడే ఉద్గారాలతో గాలి, నీరు అన్నీ కలుషితమై ఆ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఎపి జెన్‌కో) అధికారుల నిర్లక్ష్యంతో యాష్ పాండ్‌కు శనివారం గండి పడడంతో 350 ఎకరాల్లో బూడిద మేటలు వేసింది. ఈ పొలాల్లో భవిష్యత్‌లో వ్యవసాయం సాగుతుందా? లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మా జీవితాలు బూడిద పాలు చేశారంటూ ఎన్‌కో అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ముత్తుకూరు, చిల్లకూరు, టిపి గూడూరు ప్రాంతాల్లో భారీగా థర్మల్ పవర్ ప్రాజెక్టులు వెలిశాయి. రైతులు పెద్ద ఎత్తున వ్యవసాయ భూములు అప్పగించారు. 2008లో 33 వేల మెగావాట్ల పవర్ ప్రాజెక్టుల కోసం 33 వేల ఎకరాలు భూమి సేకరించారు. ఇందులో కొన్ని ప్రాజెక్టులు కార్యరూపం దాల్చలేదు. మరికొన్ని కాగితాలకే పరిమితం అయ్యాయి. ప్రభుత్వం నుంచి ఇవి తీసుకున్న భూములను అమ్మకానికి పెట్టడమో లేక అప్పు కోసం తనఖా పెట్టడమో చేశాయి. ముత్తుకూరు మండలం నేలటూరు వద్ద ఎపి జెన్‌కో థర్మల్ పవర్ ప్రాజెక్టు 1,600 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తోంది. ఇందుకోసం ఏటా 3.5 నుంచి 1.5 మిలియన్ టన్నుల బొగ్గును ఉపయోగిస్తోంది. బొగ్గు వినియోగం తర్వాత వచ్చే బూడిదను నిల్వ చేయడానికి ప్రాజెక్టు పక్కనే 300 ఎకరాల్లో యాష్‌పాండ్ ఏర్పాటు చేశారు. ఈ పాండ్‌కు భారీ బండ్ నిర్మించారు. టిడిపి, వైసిపి నేతలు ఇద్దరు దీని నిర్మాణానికి సంబంధించి కాంట్రాక్టు దక్కించుకున్నారు. ఈ బండ్ నిర్మాణం నాసిరకంగా జరుగుతోందని అప్పట్లోనే రైతులు గగ్గోలు పెట్టినా అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికే ఒకసారి దీనికి గండిపడింది. తాజాగా శనివారం రాత్రి పడమర వైపు గండిపడింది. దెబ్బతిన్న యాష్‌పాండును మిగతా 2లో

రాష్ట్రంలో ఎక్కడైనా పింఛను

- బదిలీకి గ్రీన్ సిగ్నల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



సామాజిక పింఛన్ల బదిలీకి రాష్ట్రప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన ఆప్షన్‌ను గ్రామ, వార్డు సచివాలయాల్లో అందు బాటులో ఉంచింది. ఉపాధి కోసం రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లిన వారు తమ పింఛను తీసుకోవాలంటే ఇప్పటి వరకు వారి స్వగ్రామానికి రావాల్సి ఉండేది. ప్రభుత్వం ప్రస్తుతం తీసుకున్న నిర్ణయం ప్రకారం తాత్కాలికంగా నివాసం ఉన్న ప్రాంతంలోని గ్రామ, వార్డు సచివాలయంలో తమ వివరాలు అందించి పింఛను బదిలీ చేసుకోవచ్చునని సంబంధిత వర్గాలు తెలిపాయి. గతంలో ఈ విధానం అమల్లో ఉండేది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత నిలిపివేశారు. ప్రస్తుతం మళ్లీ ఈ విధానం అమల్లోకి రావడంతో వేలాది మంది పింఛనుదారులకు ఊరట లభిస్తుందని పలువురు పేర్కొంటున్నారు.



ఢాకాలో విద్యార్థులపై లాఠీ ఎత్తుతున్న పోలీసులు

బంగ్లాలో మళ్లీ హింస

- విద్యార్థుల ఆందోళన ఉధృతం
- 14 మంది పోలీసులతో సహా 91 మంది మృతి
- దేశ వ్యాపితంగా కర్ఫ్యూ

ఢాకా : బంగ్లాదేశ్‌లో మళ్లీ హింస చెలరేగింది. దేశ ప్రధాని, అవామీ లీగ్ నాయకురాలు షేక్ హసీనా రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో ఈ సారి విద్యార్థులు వీధుల్లోకి వచ్చారు. హసీనా గద్దె దిగేంతవరకు పన్నులు, బిల్లులేవీ చెల్లించబోమంటూ సహాయ నిరా కరణకు పిలుపునిచ్చారు. పలు చోట్ల ఆందోళన కారులకు, పోలీసులకు మధ్య చోటుచేసుకున్న మిగతా 5లో

మిషన్ లైఫ్‌కు రాష్ట్రాలకు సారథిగా ఎపి

● సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
పర్యావరణ పరిరక్షణకు దోహదపడే మిషన్ లైఫ్ కార్యక్రమం అమలులో అన్ని రాష్ట్రాలకూ సారథ్యం వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ తెలిపారు. బిఇఇ, కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ, కేంద్ర ప్రభుత్వం తరపున రాష్ట్రంలో మిషన్ లైఫ్ అమలు చేసేందుకు అనుసరించాల్సిన ఉత్తమ పద్ధతులపై సమగ్ర నివేదికను బిఇఇ దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారు ఎ చంద్రశేఖర్ రెడ్డితో కలిసి సిఎస్ ఆవిష్కరించారు. అత్యంత కీలకమైన మిషన్‌ను ముందుకు తీసుకెళ్లడానికి బిఇఇ, కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖకు నిరంతరం మద్దతునిచ్చేందుకు ప్రభుత్వం ఆసక్తిగా ఉందని సిఎస్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టితో గ్రీన్ ఎనర్జీలో రాష్ట్రం గణనీయమైన ప్రగతి సాధించిందని అన్నారు. విద్యుత్ పొదుపు కార్యక్రమాలకు చంద్రబాబు శ్రీకారం చుట్టారని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

యువతిపై ఉన్మాది దాడి

ప్రజాశక్తి-తాడేపల్లి (గుంటూరు జిల్లా)
పెళ్లికి అంగీకరించలేదని యువతిపై ఓ ఉన్మాది బ్లేడుతో దాడి చేశాడు. ఈ సంఘటన గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. తాడేపల్లి సిఐ కల్యాణరాజు, ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన యువతి తాడేపల్లిలోని మణిపాల్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తూ.. వడ్డేశ్వరం సమీపంలోని హాస్టల్లో ఉంటున్నారు. విజయవాడ సమీపంలోని నున్నకు చెందిన క్రాంతి అనే యువకుడు ఐటిఐ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. కొంతకాలంగా వీరిద్దరూ ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో పెళ్లి చేసుకోవాలని యువతిని ఒత్తిడి చేస్తుండడంతో ఆమె తిరస్కరిస్తోంది. ఈ నేపథ్యంలో క్రాంతి వడ్డేశ్వరం వచ్చి యువతిని హాస్టల్ నుంచి బయటకు తీసుకొచ్చాడు. ఇద్దరూ మాట్లాడుకుంటుండగా మాటమాట పెరిగింది. కోపోద్రిక్తుడైన క్రాంతి అప్పటికే తనతో తెచ్చుకున్న బ్లేడుతో యువతి గొంతు కోశాడు. దాడి అనంతరం అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గాయపడిన యువతిని మణిపాల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతికి పాల్పడిన వారి ఆట కట్టిస్తాం :

● ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
వైసిపి పాలనలో అవినీతికి పాల్పడిన వారి ఆట కట్టిస్తామని బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. 2029 ఎన్నికల్లో పులివెందులలో కూడా వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలిచే పరిస్థితి ఉండదన్నారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పులివెందుల అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ పేరుతో రూ.60 కోట్లకు పనులు చేసి రూ.600 కోట్లకు బిల్లులు చేయించారని, దీనిపై త్వరలో విజిలెన్స్ విచారణ జరగనుందని తెలిపారు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిపోతారనే భయంతో ఆయనను వైసిపి ఎమ్మెల్సీగా జగన్ ప్రకటించారని అన్నారు.

నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూపులు

(మొదటి పేజీ తరువాయి)
త్యాగం చేసిన నేతలు, ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల కోసం సీటు త్యాగం చేసిన నేతలు ఈ విభాగంలో ఉన్నారు. సాధారణంగా వీరు ఎమ్మెల్సీ, రాజ్యసభ వంటి పదవులు ఆశిస్తారు. ఈ రెండు కూడా రెండేళ్ల వరకు భర్తీ అయ్యే అవకాశం లేదు. శాసనమండలిలో వచ్చే ఏడాది కేవలం నాలుగు స్థానాలు మాత్రమే ఖాళీ కానున్నాయి. వీటిల్లో టిడిపి సీనియర్ నేత యనమల రామకృష్ణుడుతోపాటు చిక్కాల రామచంద్రరావు, బిటి నాయుడు, పి అశోక్ బాబు ఉన్నారు. 2027లో భారీ సంఖ్యలో భర్తీ కానున్నాయి. రాజ్యసభ స్థానాలు 2026లో నాలుగు ఖాళీ కానున్నాయి. పదవులు లేకుండా అప్పటి వరకు ఉండటం నేతలు కష్టంగా భావిస్తున్నారు. కావున ముందు కార్పొరేషన్ ఛైర్మన్ పదవి తీసుకుని ఆ తర్వాత ఎమ్మెల్సీ అడగాలని భావిస్తున్నారు.

కూటమిలో పార్టీలకు పంపకాలు ఫార్ములా..!
టిడిపి కూటమిలో నామినేటెడ్ పదవుల పంపకాలు కొలిక్కొచ్చినట్లు సమాచారం. టిడిపి గెలిచిన నియోజకవర్గాల్లో ఆ పార్టీకి 60 శాతం, జనసేనకు 30 శాతం, బిజెపికి 10 శాతం చొప్పున పదవులు పంపకాలు చేయాలని మూడు పార్టీలు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. జనసేన గెలిచిన నియోజకవర్గాల్లో జనసేనకు 60 శాతం, టిడిపికి 30 శాతం, బిజెపికి 10 శాతం చొప్పున, బిజెపి గెలిచిన నియోజకవర్గాల్లో బిజెపికి 60 శాతం, టిడిపికి 30 శాతం, జనసేనకు 10 శాతం పంపకాలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.



గుంటూరు నగరంలో విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు



కాకినాడలో విరాళాలు సేకరిస్తున్న సిపిఎం కాకినాడ జిల్లా కన్వీనర్ రాజశేఖర్

వయనాడ్ బాధితులకు సాయం

సిపిఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

ప్రజాశక్తి-యంత్రాంగం
కేరళలోని వయనాడ్ వరద బాధితులకు సహాయం చేసేందుకు ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ప్రజలకు కేరళలో కొండచరియలు విరిగిపడటంతో జరిగిన విధ్వంసం గురించి వివరిస్తూ.. విరాళాల సేకరణ చేపట్టారు. ప్రజలు తమ వంతుగా సహాయం చేశారు. విశాఖ ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని చేపల మార్కెట్ వద్ద విరాళాలు సేకరించారు. ప్రజలు మొత్తం రూ.15,162 విరాళాలుగా అందించారు. గాజువాకకు చెందిన ఎంవిఆర్ ఆస్పత్రి అధినేత డాక్టర్ ఎం.రమేష్‌కుమార్ రూ.25 వేల ఆర్థిక సాయాన్ని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడుకు అందజేశారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం అచ్యుతాపురం, మోసయ్యపేట గ్రామాలలోనూ, కె.కోటపాడు మండలం ఆనందపురం గ్రామంలోనూ విరాళాలు సేకరించారు.

గుంటూరు నగరంలోని బ్రాడీపేట, అరండల్‌పేటలో పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విరాళాలు అందించారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ పాల్గొన్నారు. తాడేపల్లి పట్టణంలోని సుందరయ్యనగర్‌లో ఇంటింటికీ తిరిగి విరాళాలు సమీకరించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, ప్రజాశక్తి సిజిఎం వై.అచ్యుతరావు, ఎస్‌కె ఖాజావలి, సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, కె.కరుణాకరరావు, బి.రామచంద్రరావు, ఎన్.నాగేశ్వరరావు, బేబి, కె.ఉషారాణి, పి.గిరిజ, సిహెచ్.భుజంగరావు, పాల్గొన్నారు. మంగళగిరి మండలం చిన్నకాకానిలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. పల్నాడు జిల్లా నాదెండ్లలో విరాళాల సేకరణ నిర్వహించారు. కాకినాడలోని సర్పవరం జంక్షన్, ఇంద్రపాలెం భగత్ సింగ్ విగ్రహం సెంటర్లో ప్రజలు రూ.18,456లను విరాళాలుగా అందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ మోర్త రాజశేఖర్, జిల్లా నాయకులు దువ్వ శేషబాబ్జి, కాకినాడ రూరల్ కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ వయనాడ్ బాధితులను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ మానవతాదృక్పథంలో ముందుకు రావాలని కోరారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడలో జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికుల నుంచి రూ.20,771 విరాళాలు సేకరించారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తన కాన్వాయ్‌ను ఆపి సిపిఎం నాయకుల విరాళాల సేకరణ గురించి అడిగి తెలుసుకున్నారు. వారిని అభినందించడమే కాక తన వంతుగా సాయం అందించారు. తణుకు, తాడేపల్లిగూడెం, వేల్పూరు, గణపవరం, పోడూరులో ఇంటింటా తిరిగి సిపిఎం నాయకులు విరాళాలు సేకరించారు. ఏలూరు, కర్నూలు జిల్లాల్లో పలు చోట్ల సిపిఎం నాయకులు విరాళాలు స్వీకరించారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని పాచిపెంట, సీతంపేట, కొమరాడ మండలాల్లో విరాళాల సేకరణ నిర్వహించారు. పాచిపెంటలో చేపట్టిన విరాళాల సేకరణలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పాల్గొన్నారు. విజయనగరం జిల్లా కొత్తవలసలో విరాళాల సేకరణ చేపట్టారు. తిరుపతి పట్టణంలోని నాలుగు మాడవీధులలో పలువురు వ్యాపారస్తులు స్వచ్ఛందంగా వయనాడ్ బాధితులకు సాయమందించారు. ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో పలుచోట్ల విరాళాలు సేకరించారు.

వయనాడ్ విషాదాన్ని జాతీయ విపత్తుగా గుర్తించాలి

తెలంగాణ ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో
కేరళ వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడిన విషాదాన్ని జాతీయ విపత్తుగా గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. దీనిని కేవలం ఓ రాష్ట్ర సమస్యగా పరిగణించి వదిలేయాలని చూస్తే జాతి క్షమించదని హెచ్చరించారు. దక్షిణాదిలో ఇటువంటి ఘటన గతంలో ఎప్పుడూ చోటుచేసుకోలేదని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 350 మందికిపైగా దుర్మరణంపాలైన వయనాడ్ విలయాన్ని కేంద్ర ప్రభుత్వం రాజకీయ కోణంలో కాకుండా మానవీయ దృక్పథంతో చూడాలని సూచించారు. అతి భారీ వర్షాలు, క్లౌడ్ బరస్ట్‌తో కొండ చరియలు విరిగిపడటం, వర్షపు నీటితో బురద కలిసి ప్రవహించే సందర్భాల్లో ముందస్తు హెచ్చరికలకు సంబంధించి ఒక మాన్యువల్ రూపొందిచాలని ఆయన కోరారు. ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని వినియోగించి కొండ చరియలు విరిగిపడే ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాలను మ్యాపింగ్ చేయాలని సూచించారు. వాతావరణ శాఖ ఇచ్చే ఆరెంజ్, రెడ్ అలెర్టులతో ప్రమాదాలను అంచనా వేయలేమని, ఉపగ్రహాల చిత్రాల ద్వారా ఖచ్చితత్వంతో కూడిన హెచ్చరికలను జారీ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు. భూకంప ప్రాంతాలను జోన్లుగా విభజించినట్టే కొండ చరియలు కుప్పకూలే అవకాశాలున్న ప్రదేశాలను కూడా కేటగిరీల వారిగా గుర్తించాలని అన్నారు. రుతుపవనాల సమయంలో ఆ ప్రాంతాల్లో సహాయక బందాలు నిరంతరం అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయాలని కోరారు.



దుర్గమ్మకు సారె సమర్పిస్తున్న దుర్గగుడి ఇఒ రామారావు దంపతులు, ఆలయ సిబ్బంది

ఇంద్రకీలాద్రిపై ముగిసిన ఆషాడం సారె ఉత్సవాలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ (ఎన్‌టిఆర్‌జిల్లా)
విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఆషాడం సారె ఉత్సవం ఆదివారం వైభవంగా ముగిసింది. ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని దుర్గమ్మకు ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎస్.రామారావు, ఆలయ అధికారులు, సిబ్బంది సారె సమర్పించారు. ఇఒ దంపతులు, ఆలయ అధికారులు, సిబ్బంది ఊరేగింపుగా జమ్మిదొడ్డి నుంచి కనకదుర్గనగర్, మహామండపం మీదుగా ఆలయానికి చేరుకొని సారె సమర్పించారు. అనంతరం అంతరాలయంలో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఇఒ మాట్లాడుతూ ఆదివారంతో ఆషాడ మాసం ముగుస్తుందని తెలిపారు. ఆషాడ మాసం ఉత్సవాలు, వారాహి నవరాత్రోత్సవాలు, శాకంభరీ దేవి ఉత్సవాలు దిగ్విజయంగా పూర్తయ్యాయన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన యాత్రికులు సుమారు 3,100 పైగా చీరలు సమర్పించారని తెలిపారు. ఈ నెల 5 నుండి సెప్టెంబర్ 2వ తేదీ వరకు శ్రావణ మాసం సందర్భంగా దేవస్థానంలో వ్రతాలు, పలు కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

మరణంలోను వీడని స్నేహ బంధం

● హైదరాబాద్‌లో ప్రమాదానికి గురై పల్నాడు జిల్లాకు చెందిన ఇద్దరు దుర్మరణం ● స్నేహితుల దినోత్సవం రోజు విషాదం


ప్రజాశక్తి-పల్నాడు జిల్లా
స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకోవాలని వెళ్తున్న ఇద్దరు స్నేహితులను ప్రమాదం బలిగొంది. హైదరాబాద్‌లో కొత్తగూడ ఫ్లైఓవర్ పైనుంచి కిందపడి పల్నాడు జిల్లాకు చెందిన ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లాలోని బెల్లంకొండ మండల కేంద్రానికి చెందిన రోహిత్ (27) తండ్రి మృతి చెందడంతో చిన్నతనం నుండే తల్లితో కలిసి అమ్మమ్మ ఊరైన విప్పర్లలో ఉంటున్నారు. అదే గ్రామానికి చెందిన బాలప్రసన్న (25)తో కలిసి చదువుకున్నారు. రోహిత్ హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తుండగా బాల ప్రసన్న అమెరికా వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం కావడంతో రోహిత్‌తో గడిపేందుకు శనివారం హైదరాబాద్‌కు బాలప్రసన్న వెళ్లారు. వీరిద్దరూ కలిసి రాత్రి 11 గంటలు దాటిన తర్వాత హైదరాబాదులోని కేబుల్ బ్రిడ్జి మీదుగా ద్విచక్ర వాహనంపై వెళుతూ డివైడర్‌ను ఢీకొట్టి బ్రిడ్జిపై నుంచి కిందపడ్డారు. తీవ్ర గాయాలవడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. గచ్చిబౌలి పోలీసులు వీరి మృతదేహాల ను ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆదివారం హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రి వెళ్లి మృతదేహాలను సొంతూరుకి తీసుకొచ్చారు. రోహిత్‌కు తల్లి సోదరుడు ఉండగా, బాలప్రసన్నకు తల్లిదండ్రులతో పాటు ఇద్దరు సోదరులున్నారు. స్నేహితులిద్దరి మృతి పట్ల నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



కందుల రోహిత్ (ఫైల్)



ఉడతా బాల ప్రసన్న



ఎటిఎంను పగులకొట్టిన దృశ్యం

ఎస్‌బిఐ ఎటిఎంలో చోరీ

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి
అనంతపురం నగరంలోని రాంనగర్‌లో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఎస్‌బిఐ ఎటిఎం మిషన్‌ను పగలగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. గ్యాస్ కట్టర్లతో ఎటిఎం మిషన్‌ను పగలగొట్టి దాదాపు రూ.30 లక్షల నగదును దొంగలించారు. దొంగతనానికి వచ్చిన దుండగులు చుట్టపక్కల ఉన్న సిసి కెమెరాలకు నల్ల రంగు స్ప్రే చేసి చోరీకి పాల్పడ్డారు. ఎటిఎంలో భారీ చోరీ జరిగిన విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎటిఎం సెంటర్‌కు సెక్యూరిటీ సిబ్బంది లేరు. అందులోనూ అలారం సిస్టం కూడా పనిచేయడం లేదని తెలుస్తోంది. దీనిపై బ్యాంకు అధికారులు నోరు విప్పడం లేదు. తామ్స సిఎంఎస్ అనే ఏజెన్సీ నగరంలోని పలు ఎటిఎంల నిర్వహణ చేపడుతోంది. ఎటిఎంలో నగదును అప్లోడ్ చేయడాన్ని ఈ ఏజెన్సీకి ఎస్‌బిఐ బ్యాంక్ అధికారులు అప్పగించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్టు పోలీసులు తెలిపారు. క్లూస్ టీం ద్వారా ముద్రలు సేకరించారు.

భారీగా గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో
తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై భారీగా గంజాయి పట్టుబడింది. బాలానగర్, శంషాబాద్ ఎస్‌ఒటి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించగా.. ట్రక్కులో తరలిస్తున్న 803 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సైబరాబాద్ సిపి కార్యాలయంలో సైబరాబాద్ ఎస్‌ఒటి డిసిపి శ్రీనివాస్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా తెలంగాణ నుంచి మహారాష్ట్ర, కర్ణాటకకు గంజాయిని తరలిస్తున్నారు. నిందితులు డిసిఎం ఏర్పాటు చేసుకుని దానిలో మొదటి వరుసలో కెమికల్ డ్రమ్స్ పెట్టి, వెనుక వైపు గంజాయి పెట్టుకొని సరఫరా చేస్తున్నారు. ఇలా డిసిఎంలో గంజాయి తీసుకొచ్చినందుకు రూ. రెండు లక్షల నుంచి రూ.మూడు లక్షల వరకు డబ్బులు వసూలు చేస్తారు. డిసిఎంలో తీసుకొచ్చిన గంజాయిని పటాన్‌చెరు లోని ఒక నిర్మాణష్య ప్రాంతంలో ఉంచి, మహారాష్ట్ర, కర్ణాటకకు పంపించే ఏర్పాటు చేసుకున్నారు. ఆ క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు బాలానగర్, శంషాబాద్ ఎస్‌ఒటి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.మూడు కోట్లు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. ఇంత పెద్ద మొత్తంలో గంజాయిని పట్టుకోవడం ఇదే మొదటిసారి. ఐదుగురిపై కేసు నమోదు చేసి వారిని విచారిస్తున్నారు. ఈ కేసులో మొత్తం ఏడుగురి ప్రమేయం ఉన్నట్టు పోలీసులు గుర్తిం చారు. ప్రధాన నిందితుడు రాము, సోమనాథ్ కట్టర్, సురేష్ మారుతి పటేల్, విటల్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ప్రధాన నిందితుడు రాము పరారీలో ఉన్నాడు. ఈ ఆపరేషన్‌లో బాలానగర్ ఎస్‌ఒటి సిఐ శివ, ఎస్ఐ రవి కిరణ్, సిబ్బంది పాల్గొనగా.. వారిని సైబరాబాద్ సిపి అభినందించినట్టు డిసిపి తెలిపారు.

శంషాబాద్ ఓఆర్ఆర్‌పై ట్రక్కులో తరలిస్తుండగా పట్టుకున్న సైబరాబాద్ పోలీసులు



పోలీసులు స్వాధీనం చేస్తుకున్న గంజాయి

విశాఖ ఉక్కును అమ్మాలని చూస్తే ప్రతిఘటన

● ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)
కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మాలని చూస్తే ప్రతిఘటన తప్పదని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షలు ఆదివారంనాటికి 1270వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని ఓబులేసు సందర్శించి మాట్లాడారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నో పోరాటాలు, ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన ఈ కర్మాగారాన్ని ప్రయివేటీకరణ చేయడానికి పూనుకోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ఆదుకోకపోవడమే కాకుండా అమ్మాలని చూడడం సరైంది కాదన్నారు. మూడేళ్లకుపైగా ఉద్యోగులు దీక్షలు చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే తన ప్రయత్నాన్ని విరమించుకోవాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షలో స్టీల్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్మధరావు, జిఎస్‌జె.అచ్యుతరావు, నాయకులు కొండలరావు, కసిరెడ్డి సత్యనారాయణ, రెహమాన్, మసేన్‌రావు, జె.రామకృష్ణ, కె.రాజబాబు, డొక్కా నర్సింగరావు, మంత్రి రవి, మంగరాజు, నాగరాజు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న విఎస్ రావు

సంఘటిత పోరాటంతో సమస్యల పరిష్కారం

● సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం హయ్యర్ పెన్షన్ సమస్యలను తక్షణం పరిష్కరించాలి
● సదస్సులో ఎఐఆర్‌డబ్ల్యుఎఫ్ జాతీయ కార్యదర్శి విఎస్ రావు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్
హయ్యర్ పెన్షన్ వాటా రాబట్టుకోవడానికి సంఘటితంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ జాతీయ కార్యదర్శి, తెలంగాణ ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఎస్ రావు డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ పెన్షన్ పథకం 1995లో సుప్రీంకోర్టు తీర్పు అమలు మేరకు ప్రభుత్వం హయ్యర్ పెన్షన్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. 'సుప్రీంకోర్టు తీర్పు అమలు హయ్యర్ పెన్షన్ సమస్యలు' అనే అంశంపై కర్నూలు కార్మిక కర్షక భవన్లో ఆదివారం రాష్ట్ర ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారి జె దివాకర్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన విఎస్ రావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ లక్షలాదిమంది హైయర్ పెన్షన్ పొందడానికి అనేక ఆటంకాలున్నాయని, వీటిని పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇపిఎఫ్ఒ తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని అన్నారు. అస్తవ్యస్త విధానాల కారణంగా కొంతమంది సకాలంలో దరఖాస్తు చేసుకోలేక హయ్యర్ పెన్షన్ అవకాశాన్ని కోల్పోయారని తెలిపారు. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ఉద్యోగుల, కార్మికుల సమస్యల పరిష్కార దిశగా వ్యవహరించడంలేదని అన్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ ఇప్పటికే అనేక అంశాలను ఇపిఎఫ్ఒ ప్రాంతీయ కార్యాలయాలు, కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిందన్నారు. హయ్యర్ పెన్షన్ పొందడానికి, న్యాయంగా రావలసిన వాటా రాబట్టుకోవడానికి సంఘటితంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సదస్సులో రాష్ట్ర ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అయ్యప్పరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు హక్కుగా ఉద్యోగ కార్మికుల చెల్లించాల్సింది పోయి, అనేక అడ్డంకులను సృష్టించడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని విజ్ఞప్తి చేశారు. రూ. లక్షల కోట్లు పోగుబడిన పెన్షన్ నిధులను కేంద్ర ప్రభుత్వం దారి మళ్లించి షేర్ మార్కెట్లో పెట్టి వ్యాపారం చేయడం దారుణమన్నారు. ఈ సదస్సులో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి అంజి బాబు, ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి విఎస్ రాయుడు, జిల్లా నాయకులు కెసి.శేఖర్, బి.నాగరాజు, ఎ. దేవరాజు, ఎస్.హనుమంత ఆర్‌టిసి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు జి శ్రీనివాసులు, ఎస్ఎస్ రావు, ఎస్ సాంసన్, రిటైర్డ్ పేపర్ మిల్లు యూనియన్ నాయకులు రామాంజనేయులు, గ్లాస్ ఫ్యాక్టరీ రిటైర్డ్ యూనియన్ నాయకులు కె సుధాకరప్ప, కర్నూలు, నంద్యాల,అనంతపురం జిల్లా పెన్షనర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతుల బతుకులు బుగ్గి!

(మొదటి పేజీ తరువాయి)
అధికారులు పూడ్చలేదు. ట్రాక్టర్లతో మట్టి తీసుకొచ్చి పక్కన మరో బండ్ ఏర్పాటు చేస్తున్నారు.

ఎమ్మెల్యే ముందు రైతుల గోడు
స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వైసిపి నేత మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆ ప్రాంతాన్ని ఆదివారం సందర్శించినప్పుడు రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఏటా రెండు పంటలు పండిచేవారమని, ఎకరానికి నాలుగు పుట్లు వరి దిగుబడి వచ్చేదని తెలిపారు. బూడిద మేటలు వేయడంతో ఈ పొలాల్లో పంటల సాగు ప్రశ్నార్థకం కానుందని వాపోయారు. ఐదేళ్ల వరకు పంట దిగుబడి రాదని కొందరు, భవిష్యత్తులో కూడా పంట దిగుబడి ఉందని మరికొందరు ఆందోళన వ్యక్తం చేశారు. తమకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయం కోసం రైతులు ఆందోళనకు సిద్ధం అవుతున్నారు.

న్యాయవిచారణ జరపాలి : సిపిఎం
యాష్‌పాండ్ నిర్మాణ పనులు నాసిరకంగా చేపట్టడం వల్లనే కట్టకు గండి పడిందని, కట్ట తెగిపోయిన ఘటనపై న్యాయ విచారణకు ఆదేశించడంతోపాటు బాధిత రైతులకు పరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. యాష్‌పాండ్ కట్ట తెగిపోయిన ప్రాంతాన్ని సిపిఎం జిల్లా కమిటీ బృందం ఆదివారం పరిశీలించింది. అనంతరం నెల్లూరులోని సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మూలం రమేష్ మాట్లాడుతూ ఎపి జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు సమయంలో ప్రభుత్వం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో యాష్‌పాండ్ నుంచి బకింగ్ హామ్ కెనాల్ వరకూ కాంక్రీట్ కెనాల్ నిర్మించాలని అధికారులకు ప్రజలు సూచించినా ఫలితం లేకపోయిందన్నారు. యాష్‌పాండ్ కట్ట తెగిపోవడం వల్ల మిట్టపాళెం, ముసునూరురిపాళెం ప్రాంతాలకు చెందిన రైతుల, మత్స్యకారుల భూములు బూడిద దిబ్బలుగా మారాయన్నారు. రొయ్యలు, చేపలు పెంపకం చేస్తున్న రైతులు భారీగా నష్టపోయారని, ఎకరాకు రూ.3 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

గతంలో ఎన్‌టిటిపిఎస్‌లో ఇటువంటి ప్రమాదం
ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్‌టిటిపిఎస్)లో పదేళ్ల క్రితం ఇటువంటి ప్రమాదమే జరిగింది. బూడిద చెరువు కట్టలు తెగడంతో సమీప ప్రాంతాలు, పొలాలు మొత్తం బూడిదమయమయ్యాయి. అప్పటి నుంచి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నామని, ఉత్పత్తి అయిన బూడిదను ఎప్పటికప్పుడు విక్రయించేస్తున్నామని ఎన్‌టిటిపిఎస్ చీఫ్ ఇంజనీర్ నాగరాజు తెలిపారు. కడపలోని రాయలసీమ పవర్ థర్మల్ ప్లాంట్ యాష్‌పాండ్ కట్టలు బలంగా ఉన్నాయని, వారం వారం తనిఖీలు నిర్వహిస్తున్నామని ప్లాంట్ సూపరిండెంటెండ్ ఇంజనీర్ శ్రీధర్ తెలిపారు. అనకాపల్లి జిల్లా పరవాడలోని ఎన్‌టిపిసిలో ఉత్పత్తి అనంతరం వచ్చే బూడిదను ఎప్పటికప్పుడు విక్రయిస్తున్నట్లు తెలిసింది.

బాధిత రైతులను ఆదుకుంటాం : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి
నెల్లూరులోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ ప్లాంటు బూడిద చెరువు గండి వల్ల దెబ్బతిన్న పొలాల రైతులను ఆదుకుంటామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. సమగ్ర సర్వే జరిపి బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రమాదానికి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రమాదానికి కారణాలపై సమగ్ర విచారణకు ఆదేశామన్నారు.

చిరంజీవి, రామ్‌చరణ్ కోటి విరాళం

(మొదటి పేజీ తరువాయి)
రూ.20 లక్షలు, మమ్ముట్టి, ఆయన తనయుడు దుల్కర్‌సల్మాన్ రూ.35 లక్షలు, పహద్ ఫాజిల్ రూ.25 లక్షల విరాళం ప్రకటించారు. తాను వ్యవస్థాపకుడిగా ఉన్న విశ్వశాంతి ఫౌండేషన్ ద్వారా రూ.3 కోట్ల విరాళం ఇవ్వడమే కాకుండా స్వయంగా సహాయక చర్యల్లో పాల్గొంటూ మోహన్‌లాల్ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. టాలీవుడ్ ప్రతిష్టాత్మక సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తరపున నిర్మాత సూర్యదేవర నాగవంశీ రూ.5 లక్షల విరాళాన్ని అందించారు.

కంటైనర్లలో గిరిజన విశ్వవిద్యాలయం!



శాశ్వత భవనాలు లేక విద్యార్థులకు అవస్థలు
వరండాలే తరగతి గదులు
వసతికీ దిక్కులేదు



మా ఊరికి దగ్గరగా ఉందని గిరిజన విశ్వవిద్యాలయంలో చేరాను. తీరా ఇక్కడ చూస్తే కంటైనర్లు, ఇరుకైన కొద్దిపాటి గదుల్లో తరగతులు సాగుతున్నాయి. చాలా ఇబ్బందికరంగా ఉంది. ఎండవేడి, ఉక్కపోతల నుంచి తట్టుకోలేకపోతున్నాం.

- ఎంబిఎ విద్యార్థిని జె.దేదీపిక



స్థానికంగా హాస్టల్ సదుపాయం లేక సకాలంలో తిండి కూడా కష్టతరంగా మారింది. దరిదాపుల్లో హాస్టల్ సదుపాయాలు లేవు. యూనివర్సిటీకి దూరంగా ఉన్న విజయనగరంలో గదులు అద్దెకు తీసుకుని ఉంటున్నాం. ఎండైనా, వానైనా అంతదూరం వెళ్లి తినాల్సింది. దీనివల్ల సమయం కూడా వృథా అవుతోంది. చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నాం.

- జార్ఖండ్‌కు చెందిన విద్యార్థి అమత్యా



అధ్యాపకులు పూర్తి స్థాయిలో లేరు. ఏ కోర్సులో చూసినా రెగ్యులర్ అధ్యాపకులు ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే ఉన్నారు. మిగిలిన వారంతా గెస్ట్ లెక్చరర్లే. వీరిలో కొంతమంది మాత్రమే తరగతులకు వచ్చి పాఠాలు బోధిస్తారు. మిగిలిన వారంతా దూరదృశ్య తరగతులే నిర్వహిస్తున్నారు. ఆ గంట మినహా మిగిలిన సమయాల్లో వచ్చిన సందేహాలను నివృత్తి చేసుకోలేకపోతున్నాం.

- తెలంగాణాకు చెందిన యుజి, ద్వితీయ సంవత్సరం విద్యార్థి బాలశ్రీనందన్

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

ఇవి కేవలం ఈ ముగుర్గి సమస్యలు మాత్రమే కాదు. ఈ యూనివర్సిటీని సందర్శించిన 'ప్రజాశక్తి' ఎదుట ఒడిశాకు చెందిన అబీబ్స్, కేరళకు చెందిన రిన్నూ బీజో సహా ఎంతోమంది విద్యార్థులు తమ సమస్యలు ఏకరువుపెట్టారు. గదులు, హాస్టల్, అధ్యాపకుల కొరత మాత్రమే కాదు.... ఆట స్థలం, వివిధ రంగాలపై పరిశోధనలకు స్థలం, మౌలిక సదుపాయాలు లేకపోవడం వంటి ఎన్నో సమస్యలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమే ఇందుకు కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా 2014లో విజయనగరం జిల్లాకు మంజూరు చేసిన ఈ యూనివర్సిటీకి సొంత గూడు కల్పించడంలో రకరకాల కుంటిసాకులతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నెట్టుకొచ్చింది. 2019 ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు యూనివర్సిటీ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినప్పటికీ శాశ్వత భవనం ఏర్పాటు చేయలేదు. వర్సిటీ స్థాయికి తగ్గట్టు కోర్సులు ప్రవేశపెట్టలేదు. ఉన్న కోర్సులకు తగినంత అధ్యాపకులను నియమించలేదు. ఈ నేపథ్యంలో విజయనగరం మెడికల్ కళాశాలకు సమీపంలోని ఎయుకి చెందిన భవనంలో 120 అడ్మిషన్లతో నాడు ప్రారంభమైంది. ప్రస్తుతం 434 మంది విద్యార్థులు ఉన్నారు. తరగతి గదుల సమస్యతో వరండాలను సైతం తరగతి గదులుగా మార్చారు. కంటైనర్లలో లేబొరేటరీలు ఏర్పాటు చేశారు. అధునాతన పరికరాలు ఉన్నా వాటిని వినియోగంలోకి తీసుకురాలేని పరిస్థితి ఉందని అధ్యాపక బృందం ఆవేదన వ్యక్తం చేస్తోంది. విలువైన పుస్తకాలు ఉన్నా ప్రత్యేకించి లైబ్రరీ లేదు. విద్యార్థుల ఆటపాటలకు స్థలం, వ్యాయామశాల కరువవడంతో అంతా కలిసిమెలిసి ఉండడం, ఉల్లాసంగా, ఉత్సాహంగా గడపడం వంటివి మచ్చుకు కూడా కనిపించని దుస్థితి వర్సిటీలో నెలకొంది.

అధ్యాపకులు అంతంత మాత్రమే

వర్సిటీలో ప్రస్తుతం ఎంఎ ఇంగ్లీష్, ఎంఎ సోషియాలజీ, ఎంఎ ట్రైబల్ స్టూడెంట్స్, ఎంఎస్‌సి బయోటెక్నాలజీ, ఎంఎస్‌సి కెమిస్ట్రీ, మాస్టర్ ఆఫ్ జర్నలిజం, మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ వంటి ఎనిమిది పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సులతోపాటు మరో ఆరు అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు ఉన్నాయి. సాధారణంగా ప్రతి పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుకు కనీసం ప్రొఫెసర్, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు చొప్పున ఏడుగురు ఉండాలి. ఈ లెక్కన 98 మంది అధ్యాపకులు అవసరం. 18 మంది మాత్రమే పర్మినెంట్ అధ్యాపకులు ఉన్నారు. మిగిలిన 80 మంది గెస్ట్ లెక్చరర్లు. వీరిలో 30 మంది మాత్రమే నేరుగా తరగతి గదుల్లో చదువులు బోధిస్తున్నారు. మిగిలిన 50 మంది దూరదృశ్య తరగతులు నిర్వహిస్తున్నారు. పోస్టుల భర్తీకి కేంద్ర విద్యాశాఖ మీనమేషాలు లెక్కిస్తోంది.

ఇదీ శాశ్వత నిర్మాణలకు నిధుల పరిస్థితి

2019 సాధారణ ఎన్నికలకు ముందు కొత్తవలస మండలం రెల్లి రెవెన్యూ పరిధిలో 526 ఎకరాలను యూనివర్సిటీ కోసం అప్పటి టిడిపి ప్రభుత్వం కేటాయించింది. హడావుడిగా ప్రహరీ నిర్మాణం చేపట్టింది. ఆ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల సరిహద్దులోని మెంటాడ మండలం చినమేడపల్లి రెవెన్యూ పరిధిలోకి స్థలాన్ని మార్పు చేసింది. ఇందుకోసం 561.88 ఎకరాలను సేకరించింది. 2023 ఆగస్టు 25న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రెండోసారి శంకుస్థాపన చేశాయి. వర్సిటీ నిర్మాణానికి రూ.834 కోట్లు కేటాయించినట్టు శంకుస్థాపనకు వచ్చిన అప్పటి సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అప్పటి కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు. 2027 నాటికి ఈ పనులు పూర్తి చేసేందుకు మినిస్ట్రీ ఆఫ్ స్టీల్ అండర్‌లోని మెకాన్ ఇండియా కంపెనీ ఒప్పందం కుదుర్చుకుని పనులు చేపట్టింది. రూ.305 కోట్ల వ్యయంతో ఫేజ్-1 పనులు చేపట్టారు. ప్రస్తుతం చాలా వరకు భూమి చదును చేయడం పూర్తయింది. మట్టి, నీటి పరీక్షలు పూర్తి చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యాన వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు దాదాపు చివరి దశకు వచ్చాయి. భవన నిర్మాణాలకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. యూనివర్సిటీ నిర్మాణ స్థలాన్ని కొత్తవలస మండలం రెల్లికి మార్పు చేయాలంటూ జిల్లాకు చెందిన కొంతమంది అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో యూనివర్సిటీ నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. యూనివర్సిటీ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి తమ సమస్యలు పరిష్కరించాలని, పూర్తి స్థాయిలో అధ్యాపకులను నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు.



ఆదోనిలో టి షడ్రక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంఎ.గఫూర్

ప్రజల మనిషి షడ్రక్‌కు ఘన నివాళి

- కర్నూలు, ఉల్చాలలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియును ఏర్పాటు చేయడంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి షడ్రక్ కీలక పాత్ర పోషించారని వక్తలు కొనియాడారు. షడ్రక్ నాలుగో వర్ధంతి సభను కర్నూలు జిల్లాలో ఆదివారం పలుచోట్ల నిర్వహించారు. కర్నూలులో మైత్రి హాస్పిటల్, భరత్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కంటి పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఉల్చాల గ్రామంలో ఎపిరైతు సంఘం, డివైఎఫ్ఐ జిల్లా కమిటీలు అమీలియో హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదోనిలో ఆయన చిత్రపటానికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి తదితరులు పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఎంఎ గఫూర్ మాట్లాడుతూ ఆయన కార్మిక, సామాజిక ఉద్యమాలను షడ్రక్ నిర్మించిన తీరును, పోరాట పటిమను స్మరించుకున్నారు. అయన అడుగుజాలో పయనిస్తామని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళతామని అన్నారు.

సిపిఎం జిల్లా కర్నూలు కార్యాలయం సుందరయ్య భవన్‌లో న్యూ సిటీ కార్యదర్శి టి రాముడు అధ్యక్షతన షడ్రక్ చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి నిర్మల, సిపిఎం నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా పి నిర్మల మాట్లాడుతూ ఉద్యోగం కంటే కార్మిక హక్కులే ముఖ్యమని సిపిఎంలో షడ్రక్ చేరి ఉద్యమించారు. జిల్లాలో సిపిఎం ఉద్యమ నిర్మాణంలో టి నరసింహయ్య, ఎంఎ గఫూర్‌తో కలసి టి షడ్రక్ కృషి చేశారని తెలిపారు. చివరి క్షణం వరకు రాజీ పడకుండా ప్రజల సమస్యల కోసం కృషి చేశారన్నారు. అనంతరం డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై నగేష్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు, ఐద్వా జిల్లా అధ్యక్షులు కె అరుణ, నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ సాయిబాబా తదితరులు మాట్లాడారు.

మార్చికల్లా దేశమంతటా
బిఎస్‌ఎన్‌ఎల్ 4జి సేవలు

- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రజాశక్తి-తాడికొండ (గుంటూరు జిల్లా)

వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలోని అన్ని ప్రాంతాలకు బిఎస్ఎన్ఎల్ 4జి సేవలను విస్తరిస్తామని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు జిల్లా తాడికొండలో బిఎస్ఎన్ఎల్ 4జి టవర్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టెలికం రంగంలో పోటీతత్వం అవసరమన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి 70 శాతం, వచ్చే ఏడాది మార్చికి నూరు శాతం 4జి సేవలను దేశవ్యాప్తంగా అమలు చేయబోతున్నట్లు చెప్పారు. పెరిగిన రీఛార్జ్‌ల భారాన్ని మారుమూల గ్రామాల్లోని ప్రజలు భరించలేకపోతున్నారని, ఈ భారం నుండి ప్రజలను తప్పించడానికి బిఎస్ఎన్ఎల్‌ను 4జి సేవలతో ఆధునీకరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయని తెలిపారు. అతి తక్కువ ధరలకే నాణ్యతతో కూడిన ఇంటర్నెట్ సేవలను ప్రజలు వినియోగించుకోవడమే లక్ష్యంగా 4జి టవర్లను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, బిఎస్ఎన్ఎల్ సిఎండి రాబర్ట్ జె.రవి, ఎపి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ శేషాచలం పాల్గొన్నారు.

అక్టోబర్ 4 నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

- నాలుగు మాడ వీధులను తనిఖీ చేసిన అదనపు ఇఒ

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో:

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబర్ నాలుగు నుండి 12 వరకు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో తిరుమలలోని శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధుల్లోని గ్యాలరీలను ఆదివారం సంబంధిత అధికారులతో కలిసి టిటిడి అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి పరిశీలించారు. వాహన మండపం నుంచి ప్రారంభమై నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీలు, తిరుమల నంబి ఆలయం వద్ద కదిలే వంతెన, గ్యాలరీల వద్ద ప్రవేశ నిష్క్రమణ పాయింట్లు, ఇతర సంబంధిత సమాచారాన్ని అదనపు ఇఒకు అధికారులు వివరించారు. ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, విజిఒ నంద కిషోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

80 శాతం రాయితీపై వరి విత్తనాలు : మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అధిక వర్షాల కారణంగా ముంపునకు గురై పంటలు నష్టపోయిన రైతులకు 80 శాతం రాయితీపై వరి విత్తనాలను పంపిణీ చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఇందులో భాగంగా సుమారు 6,356 క్వింటాళ్ల వరి విత్తనాలను తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లో రైతు సేవా కేంద్రాల వద్ద రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా పంపిణీ చేయడానికి సిద్ధం చేశామన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఖరీఫ్ సీజన్‌లో 48.6 శాతం అధిక వర్షపాతం నమోదు కావడంతో ఇప్పటికే వరి ఊడ్పుల కోసం సిద్ధంగా ఉన్న సుమారు 1,406 హెక్టార్ల నారుమళ్లు, 33 వేల హెక్టార్లలో నాట్లు పూర్తయిన వరి పంట ముంపునకు గురైందని ఆయన పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మంత్రుల బృందం ముంపు ప్రాంతాల్లో పర్యటించిందని, రాష్ట్ర, జిల్లాల వ్యవసాయాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమీక్షలు నిర్వహించి ముందస్తుగానే రైతుల అవసరాలకు తగినట్లుగా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు.

బుద్ధి మార్చుకోని జగన్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఛీటింగ్ బుద్ధిని మార్చుకోలేదని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. రాష్ట్రంలో ఏదో జరిగిపోతున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్నాడులో టిడిపి కార్యకర్త తోట చంద్రయ్యను నడిరోడ్డుపై గొంతు కోసి చంపినప్పుడు జగన్ కళ్లు మూసుకుని కూర్చున్నారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగానే ఉన్నాయని, జగన్ మానసిక పరిస్థితే బాగోలేదని పేర్కొన్నారు. ల్యాండ్, శాండ్, వైన్, మైనింగ్ ముఠా పాలన నడిపింది జగన్ అని విమర్శించారు. తమ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలని సూచించారు. లేదంటే వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కూడా జగన్ గెలవలేరని అన్నారు. త్వరలో వైసిపి కార్యాలయానికి టూలెట్ బోర్డు పెట్టుకోవడం ఖాయమని ఎద్దేవా చేశారు.

వైసిపి కార్యకర్త దారుణ హత్య

- రాజకీయ కక్షతోనే నా భర్తను హతమార్చారు
- మృతుడి భార్య సుబ్బమ్మ ఆరోపణ
- టిడిపి నాయకులను పోలీసులు అడ్డుకోలేదని గ్రామస్తుల విమర్శలు



సుబ్బరాయుడు (ఫైల్)

ప్రజాశక్తి- మహానంది (నంద్యాల జిల్లా)

నంద్యాల జిల్లా మహానంది మండలం సీతారామాపురం గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున వైసిపి కార్యకర్త సుబ్బరాయుడు (65) దారుణ హత్యకు గురయ్యారు. రాజకీయ కక్షతోనే తన భర్తను టిడిపి వారు హత్య చేశారని హతుని భార్య ఆరోపించారు. టిడిపి వారిని అడ్డుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. గ్రామస్తుల కథనం ప్రకారం... టిడిపి నాయకులు శ్రీనివాస్‌రెడ్డి అనుచరులు 30 మంది శనివారం అర్ధరాత్రి సుబ్బరాయుడు ఇంటి వద్దకు వచ్చారు. సుబ్బారాయుడు ఎక్కడున్నాయని ఆయన భార్యను వారు అడిగారు. తన భర్త ఇంట్లో లేరని ఆమె చెప్పారు. దీంతో, టిడిపి నాయకులు ఇంట్లో చొరబడి, సుబ్బరాయుడుని బయటకు ఈడ్చుకొచ్చి గొడ్డలి, కత్తులతో దాడి చేసి హత్య చేశారు. గత ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తరపున సీతారామాపురం గ్రామంలో సుబ్బరాయుడు, నారపురెడ్డి, జమాల్‌రెడ్డి ప్రచారం చేశారు. ఎన్నికల ముందు టిడిపిలోకి వెళ్లిన బుడ్డా శ్రీనివాస్‌రెడ్డి వీరిపై రాజకీయ కక్ష పెంచుకున్నారు. ఊరి విడిచి వెళ్లిపోవాలని వారిని పలుమార్లు హెచ్చరించారు. శనివారం రాత్రి సీతారామాపురం గ్రామం నుండి మాజీ ఎమ్మెల్యే శిల్పా అనుచరులు తమకు బుడ్డా శ్రీనివాస్‌రెడ్డి నుండి ప్రాణహాని ఉందని ఎస్‌పికి ఫోన్ ద్వారా తెలిపారు. దీనిపై ఎస్‌పి స్పందించి, గ్రామానికి ఒక ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లను పంపారు. టిడిపి నాయకులు పోలీసులను కూడా హెచ్చరించి సుబ్బరాయుడును హత్య చేశారని గ్రామస్తులు చెబుతున్నారు. జిల్లా ఎస్‌పి అధిరాజ్‌సింగ్ రాణా ఘటనా స్థలానికి ఆదివారం చేరుకొని విచారణ చేపట్టారు. సాయంత్రం జరిగిన సుబ్బరాయుడు అంతిమయాత్రలో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొని నివాళ్లులర్పించారు.

రాష్ట్రంలో హత్యా రాజకీయాలు : వైసిపి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు

సుబ్బరాయుడు కుటుంబసభ్యులను చక్రపాణిరెడ్డి, ఆలూరు వైసిపి ఎమ్మెల్యే విరూపాక్షి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, వైసిపి ఆళ్లగడ్డ, నంద్యాల, పనగానపల్లి, ప్రాణ్యం మాజీ ఎమ్మెల్యేలు బ్రిజేంద్రరెడ్డి, శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో హత్యా రాజకీయాలు నడుస్తున్నాయని ఆరోపించారు. వీటికి ఫుట్‌స్టాప్ పెట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే తాము తిరగబడాల్సి వస్తుందని హెచ్చరించారు.

టిడిపి నాయకులపై కేసు

టిడిపి నాయకులు బుడ్డా శ్రీనివాస్‌రెడ్డి, భాస్కరరెడ్డి, వారి అనుచరులు 32 మందిపై హత్య కేసు నమోదు చేసినట్లు నంద్యాల రూరల్ సిఐ శివకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ హత్య నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా అడిషనల్ ఎస్‌పి ఆధ్వర్యాన గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

భయభ్రాంతులకు గురిచేయడానికే దుర్మార్గాలు : జగన్ అమరావతి బ్యూరో : రెండు నెలల కాలంలోనే రాజకీయ హింసకు మారుపేరుగా రాష్ట్రం మారిపోయిందని, ప్రజాస్వామ్య ప్రభుత్వ స్థానంలో ముఠాలపాలన కనిపిస్తోందని వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. ప్రభుత్వంలోని పెద్దల ప్రోత్సాహంతో జరిగే ఘటనలు, అధికారంలో తమ పార్టీ ఉందనే ధీమాతో చేస్తున్న దాడులు, రాజకీయ ప్రేరేపిత దుశ్చర్యలు రాష్ట్రంలో ప్రతిరోజు జరుగుతూనే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. 'నంద్యాలజిల్లాలో శనివారం రాత్రి జరిగిన హత్య, ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలో జరిగిన దాడి వీటికి నిదర్శనాలే. హామీలను చంద్రబాబు నిలబెట్టుకోలేకపోవడంపై ఎవరూ ప్రశ్నించకూడదని, రోడ్డుపైకి రాకూడదని ప్రజలను, వైసిపి నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేయడానికి ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నారు. బాధితులకు అండగా ఉంటూ పోరాటాన్ని కొనసాగిస్తామని' జగన్ పేర్కొన్నారు.



ఆస్పత్రిలో శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న సామినేని ఉదయభాను

పెనుగంచిప్రోలులో మాజీ ఉప సర్పంచ్‌పై హత్యాయత్నం

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లాలో వైసిపి నాయకుడిపై శనివారం రాత్రి హత్యాయత్నం జరిగింది. ఆయనపై కొందరు ప్రత్యర్థులు దాడి చేసి తీవ్రంగా గాయపడిచారు. ఈ సంఘటన పెనుగంచిప్రోలు మండలం కొనకంచి అడ్డరోడ్డు వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. పెనుగంచిప్రోలు మండల వైసిపి నాయకుడు, నవాబుపేట గ్రామ మాజీ ఉప సర్పంచ్ గింజుపల్లి శ్రీనివాస్ తన సొంతపని నిమిత్తం బయటకు వెళ్లారు. రాత్రి 11 గంటల సమయంలో తిరిగి వస్తూ టిఫిన్ చేసేందుకు కొణకంచి అడ్డరోడ్డు 65వ నెంబర్ జాతీయ రహదారి వద్ద ఆగారు. అదే సమయంలో అక్కడే మాటువేసిన నవాబుపేట గ్రామానికి చెందిన కొందరు టిడిపి నాయకులు ఒక్కసారిగా శ్రీనివాస్‌పై దాడి చేశారు. కిందపడిపోయినా వదలకుండా కర్రలతో కొట్టి అక్కడి నుంచి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను స్థానికులు విజయవాడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. 2009లో శ్రీనివాస్ తండ్రి గింజుపల్లి వీరయ్యను టిడిపి నాయకులే గ్రామ శివాలయంలో దాడి చేసి కిరాతకంగా హత్య చేశారు. ఆ కేసులో నిందితులైన టిడిపి నాయకులే శ్రీనివాస్‌ను హత్య చేసేందుకు ప్రయత్నించారు. శ్రీనివాస్ గ్రామంలోనే కాకుండా జగ్గయ్యపేట నియోజకవర్గంలోనే కీలకమైన నేతగా, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు అనుచరుడిగా ఉన్నారు. శ్రీనివాస్‌పై హత్యాయత్నం నేపథ్యంలో గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాంబాబు తెలిపారు.



నిండుకుండలా నాగార్జున సాగర్

- నేడు తెరుచుకోనున్న గేట్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

నాగార్జున సాగర్ జలాశయానికి భారీగా నీటి ప్రవాహం కొనసాగుతోంది. జలాశయం 90 శాతం నిండటంతో సోమవారం గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. శ్రీశైలం నుంచి ఆదివారం సాయంత్రం 6 గంటలకు 4.57 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతుండగా సాగర్‌కు 3.22 లక్షల క్యూసెక్కులు వస్తోంది. సాగర్ నుంచి దిగువన కాల్వలకు 37,878 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ఆదివారం రాత్రి 8 గంటలకు 576.10 అడుగులకు చేరింది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 312 టిఎంసిలు కాగా ప్రస్తుతం 271.90 టిఎంసిల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. పులిచింతల గరిష్ట నీటి నిల్వ 47 టిఎంసిలు కాగా.. ప్రస్తుతం 5.91 టిఎంసిలే నిల్వ ఉంది. సాగర్ నుంచి పులిచింతలకు నీటి విడుదల ప్రారంభమైంది. పులిచింతలకు ఎగువ నుంచి 25,637 క్యూసెక్కులు వస్తోంది. పులిచింతల నుంచి దిగువకు ప్రకాశం బ్యారేజీకి 10,199 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సోమవారం సాయంత్రానికి ప్రకాశం బ్యారేజికి కూడా వరద ప్రవాహం పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - పోలవరం (ఏలూరు జిల్లా)



రామకృష్ణ (ఫైల్)

అప్పుల బాధ తాళలేక కౌలురైతు బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఏలూరు జిల్లా పోలవరం మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గూటాల గ్రామానికి చెందిన పలకంశెట్టి రామకృష్ణ (41) 15 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నారు. వరుస నష్టాలతో ఇబ్బందులు పడుతూనే తాజాగా ఖరీఫ్ సాగు చేశారు. భారీ వర్షాలు, వరదలకు నాట్లు పూర్తిగా నీట మునిగి పూర్తిగా దెబ్బతిన్నాయి. మళ్లీ సాగు చేయాలంటే చేతిలో చిల్లిగవ్వ లేకపోవడం, ఇప్పటికే పంటల సాగు నిమిత్తం చేసిన అప్పులు సుమారు రూ.17 లక్షల వరకూ ఉండటంతో తీవ్రమనస్తాపానికి గురయ్యారు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో కలుపుమందు తాగారు. కుటుంబ సభ్యులు ఆయనను తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడిలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం రాత్రి మృతి చెందారు. మృతుడు రామకృష్ణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.




శారీ వాక్‌లో పాల్గొన్న హోమ్ మంత్రి అనిత

చేనేతకు మద్దతుగా విశాఖలో శారీ వాక్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

చేనేత వస్త్రాలను ఆదరించాలని కోరుతూ ది స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ ఆధ్వర్యాన విశాఖలో హ్యాండ్లూమ్ శారీ వాక్‌ను ఆదివారం హోం మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. అనంతరం వాక్‌లో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశం అంటే ముందుగా గుర్తుకు వచ్చేది చీరకట్టు అని అన్నారు. చీరకట్టడం అనాదిగా వస్తున్న సంప్రదాయమని, చీరలో అమ్మదనం, కమ్మతనం ఉంటుందని పేర్కొన్నారు. భావితరాలు ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలని కోరారు. చేనేత కార్మికులు ఇప్పటికీ చాలా ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఈ ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. నిర్వాహకులకు మంత్రి అనిత ప్రత్యేక అభినందనలు తెలిపారు. శారీ వాక్‌లో పాల్గొన్న మహిళలకు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం హోమ్‌మంత్రిని ది స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ సభ్యులు దొరబాబు, డాక్టర్ పద్మశ్రీ, వినయ్, శేఖర్, లలిత, శ్రీనివాస్ సత్కరించారు.



"పుస్తకాలను ప్రేమించండి. అవి మీ జీవితాలను సుఖమయం చేస్తాయి. భయంకర బాధల ఉప్పెనలో ఉపశమనం సమకూరుస్తాయి."

- మాక్సిం గోర్కీ

ప్రజల గొంతుక గౌ.నా. మాస్టారు

సందర్భం



అనాదిగా కళింగాంధ్రలో సాహితీయోధులకు కొదువ లేదు. ప్రత్యేకించి కథ, గేయ సాహిత్యాలకు నిలయమైన ఈ నేలలో ఎందరో మహనీయులు తమ సాహిత్య సేవను మహోజ్వలంగా కొనసాగించారు. అంతేనా? అంటే కాదు; అనేక సాహితీ ప్రక్రియలు విలసిల్లిన సీమగా కళింగసీమ పేరెన్నిక గన్నది. సాహితీ సాంస్కృతిక ఉద్యమంలో ఈ గడ్డ తనవంతు పాత్రను పోషించింది. అలాంటి ఈ నేల మీద 'పాడుదమా స్వేచ్ఛాగీతం' అనే గీతంతో సాహితీ లోకంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపును పొందారు గంటేడ గౌరు నాయుడు (గౌ.నా) మాస్టారు. 1954 ఆగస్టు 7వ తేదీన ఆయన విజయనగరం జిల్లా కొమరాడ మండలం దళవాయిపేట గ్రామంలో సత్యంనాయుడు, సోములమ్మ దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్య స్వగ్రామంలో, ఉన్నత విద్య కోటిపల్లిలో, ఇంటర్మీడియట్ విద్య పార్వతీపురంలో అభ్యసించారు. ఈయనకు ప్రముఖ రచయిత అట్టాడ అప్పల్నాయుడు సహాధ్యాయులు. గౌరునాయుడు సామవేదుల రామగోపాలశాస్త్రి వద్ద ప్రాచీన సాహిత్యాన్ని నేర్చుకున్నారు. 1978లో పార్వతీపురం గిరిజన సంక్షేమశాఖలో తెలుగు ఉపాధ్యాయుడుగా చేరి, మూడు దశాబ్దాల పాటు సేవలందించారు. పద్య కవిత్వం, వచన కవిత్వం, పాట, గేయం, గజల్ మొదలగు సృజన ప్రక్రియల ద్వారా విశేషమైన గుర్తింపు సంపాదించుకున్నారు. భూషణం, కారా మాస్టార్ల ప్రభావంతో కథారచయితగా ఎదిగి, కళింగాంధ్ర వెతలను ఎరుక పరిచే కథలను ఎన్నో రాశారు. ఇంకా వర్ధమాన సాహితీవేత్తల రచనలను నిశితంగా పరామర్శిస్తూ ఒక విమర్శకునిగా ప్రత్యేక స్థానాన్ని అందుకున్నారు. అదేగాక ఒక గాయకుడిగా, ఒక చిత్రకారునిగా తగినంత గుర్తింపు పొందారు. 'స్నేహ కళాసాహితి'ని స్థాపించి పదిమంది కళాకారులను తయారు చేసిన ధన్యజీవి మాస్టారు. పలు సాహితీ ప్రక్రియల్లో డజనుకు పైగా గ్రంథాలను వెలువరించి, రెండు డజన్లకు పైగా పురస్కారాలను పొంది, బహుముఖ ప్రజ్ఞాశాలిగా వెలుగొందుతున్నారు.

గౌ.నా మాస్టారు పుట్టిన ఊరును ఆనుకొని ప్రవహిస్తున్న నది నాగావళి. ఈ నదిపై ప్రభుత్వం రిజర్వాయర్ నిర్మించ తలపెట్టడంతో ఆ చుట్టుపక్కల కొన్ని గ్రామాలు ముంపునకు గురయ్యాయి. పునరావాస ప్రక్రియలో భాగంగా సరైన ప్యాకేజీ అందక, అక్కడి ప్రజలు నిరాశ్రయులయ్యారు. దాంతో ప్రజలంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టారు. ఈ నేపథ్యంలో మాస్టారు కొన్ని కవితలు రాశారు. వాటిలో ఓ రెండింటిని పరిచయం చేయడమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం. ఈ కవితలు 'నదిని దానం చేసాక' అనే సంపుటిలో సంగ్రహించబడ్డాయి.

ఒడిస్సాలో పుట్టి సుమారు 250 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తున్న జీవనది నాగావళి. ఈ నది ఉత్కళాంధ్ర, ఉత్తరాంధ్ర సంస్కృతులను సమ్మిళితం చేసుకొని ప్రవహిస్తున్నది. కలహందిలో పుట్టి కళ్ళేపల్లి వద్ద బంగాళాఖాతంలో కలుస్తున్న ఈ నది ఒడిస్సా, ఉత్తరాంధ్ర ప్రజల దాహార్తిని తీరుస్తున్నది. ఈ ప్రాంత పంటపొలాల్లో పొంగిపొర్లుతూ, ఈ నేలతల్లిని సస్యశ్యామలం చేస్తూ అన్నపూర్ణేశ్వరిగా ప్రఖ్యాతిగాంచింది.

కొన్ని దశాబ్దాల క్రితం ప్రముఖ ఇంజనీర్ డాక్టర్ కె.ఎల్.రావు నాగావళి నదిపై పూర్ణపాడు వద్ద ఆనకట్ట నిర్మాణం చేస్తే, ఆ ప్రాంత వాసులకు అన్ని రకాలుగా తక్కువ నష్టంతో ఎక్కువ పంట పొలాలకు సాగునీరు అందించవచ్చని ప్రతిపాదనలు చేశారు. కానీ, దశాబ్దాలనంతరం ఏర్పడిన అప్పటి ప్రభుత్వం గతంలో అక్కడెక్కడో ఉన్న తోటపల్లి గ్రామం వద్దనే రిజర్వాయర్ నిర్మాణానికి పూనుకొంది. ఆ వార్తను పత్రికల్లో చదివి, తన భయాందోళనను కవిత ద్వారా వ్యక్తపరిచారు గంటేడ. ఇంకా ఈ నదితో తనకున్న తియ్యని జ్ఞాపకాలను, విడదీయరాని అనుభవాలను తన కైతల్లో ఆర్ద్రంగా తడుముకున్నాడు.

'నా ఏటి పాట కావాలి' అనే కవితలో "నాకు నా ఏరు కావాలి/ అమృతపూర్ణ నా తల్లి నాగావళి/ నా ఊరి పాపిటిసేరు కావాలి/ మమతల దారాలతో తీరాలను/ కలపడానికి మగ్గంలో కండెలా/ ఒడుపుగా నన్ను తన ఒడిలో కూర్చోబెట్టుకొని/ ఒడనేసే జలవస్త్రం కావాలి" అని నాగావళి నదీమతల్లి ప్రాముఖ్యతను హృద్యంగా కవిత్వీకరిస్తాడు. "అంతెత్తు ఒడ్డు నుండి దబాలున దూకి/ బుడుంగున మునిగి నీటి అడుక్కి చేరిన/నన్ను పిలక పట్టి పైకి తేల్చి/సంతోషాల ఓలలాడించిన జలడోల కావాలి/ నా మునుగీత లోయీత బారీతకు మెచ్చి/ నువ్వు నదిని జయించావురా అని/ భుజం తట్టిన అల నేస్తం కావాలి" బాల్యంలో తాను నదిలో స్నానానికి వెళ్లినప్పుడు పలు రకాల ఈతలు ఈదుతూ, కేరింతలు కొడుతూ, అలౌకిక ఆనందాన్ని పొందుతూ, ఎక్కువ కాలం అక్కడే గడపానని కవి జ్ఞప్తికి తెచ్చుకుంటాడు. అలాంటి నది పూర్తిగా తన భౌతిక స్వరూపం కోల్పోతే ఇక నేనేం కాను? అని మథనపడతాడు. "నాకు ఏరు కావాలి/ నా పూల కెరటాల తేరు కావాలి/ ఎండిన మోడుల్ని దుక్కల్ని దూలాల్ని/ అలవోకగా మోసుకొచ్చి/ ఏడాదికి సరిపడే వంట కలపను అందించి/ ఏపూటకాపూట పులుసుతోనో ఇగురుతోనో/ ముద్ద దిగటానికి జలపుష్పాలనిచ్చి/ జలదేవత కావాలి" అంటూ తన నది తన కుటుంబానికి సరిపడా ఆహారాన్ని, సిరిసంపదలిచ్చేదని గుర్తు చేసుకుంటాడు. అలాంటి నది దూరం కావడాన్ని భరించలేనంటాడు కవి. "నాకు నా ఏరు కావాలి/ హరిత ప్రవాహాల వరిచేలనారు కావాలి/ పురాణం గురువు గారినీ దప్పుగురవడినీ/ ఒకేసారి తన చేతుల్తో శిరఃస్నానం చేయించే/ తేడాలెరుగుని తల్లి నా ఏరు/ నేలబుగ్గి నెత్తికెత్తుకున్న మట్టి దేహాలను/ అలల నాలుకల్తో నాకి శుభ్రపరిచే/ గోమాత నా ఏరు" తన నది కులమతాల భేదమెరుగనిదనీ, అందరినీ ఒకేలా చూసుకొనేదనీ అంటూ ప్రకృతి దేవత యొక్క ఔన్నత్యాన్ని వివరిస్తాడు. "నా ఏటినెవరో ఎత్తుకుపోతున్నారు/ ముళ్ళ తోట పల్లేరులలో నిర్బంధిస్తున్నారు/ ముంపు గ్రామమై మూలుగుతున్న/ నన్ను సన్న వస్త్రం నేసి/ పరిహారాల పరింకంపల మీద ఆరేస్తున్నారు" అంటూ నది మాయమవ్వడం పట్ల కవి తీవ్ర మనోవేదనకు గురౌతాడు. "ఇప్పుడు నాకు కావలసింది/ నా మడిచెక్కలను మూగజీవాలను చేసి/ గుటుక్కున మింగే కదలలేని/ నిలవ నీటి కొండచిలువ కాదు/ నా గ్రామదేవత శిరసు మీద/ సుజలపూర్ణ కలశం కావాలి/ నాకు నా ఏరు కావాలి నా ఏటి పాట కావాలి" అని తన నిరసనను వ్యక్తం చేస్తూనే, తన మనుగడకు ఇబ్బందులు కల్గించవద్దని రాజ్యాన్ని వేడుకుంటాడు. అయినా నిర్వాసితుల గోడు ఆలకించేదెవరు? ఆవేదనలను చల్లార్చేదెవరు? అని కవి సంశయిస్తాడు.

ఉద్యమం చేస్తున్న తోటపల్లి నిర్వాసితులపై పోలీసులు కాల్పులు జరపారనే వార్తను తెలుసుకొన్న కవి 'నదిని దానం చేసాక' అనే కవిత ద్వారా తన నిరసనను తెలియజేస్తాడిలా. "నేల మీద నా హక్కును గురించి/ మాటలాడ్డమే నేరమయ్యింది/ నష్టపరిహారాల పులిహోర పేకెట్లతో/ రేపటి నా ఆకలి తీరేనా అని/ అడగడమే నా తప్పిదమయ్యింది/ జలయజ్ఞానికి సహకరిస్తానన్నందుకు ప్రతిఫలంగా/ నన్ను జలసమాధి చెయ్యడం భావ్యమా" సర్వం కోల్పోయిన నేను ఎక్కడికని వెళ్లగలను? ఎలా బతకగలను? అని రాజ్యాన్ని ప్రశ్నిస్తాడు కవి. "పండును తినడమెలాగో పండే నేర్పినట్టు/ బతుకులో చేయాల్సిన పోరాటాన్ని బతుకే నేర్పుతుంది/ నేలకు దూరం కావడంలోని వేదన/ నేలను ప్రేమించే వాడికే తెలుస్తుంది" అని రైతన్న బాధను, ఆ బాధలో ఉన్న ఆర్తిని, ఆ ఆర్తి ద్వారా ఎంచుకున్న పోరాటాన్ని కవి ఎరుక పరుస్తాడు. "నేలంటే కొంచెం మట్టి కొంచెం ఇసుక/ లేదా కొన్ని రాళ్ల రప్పలేనా/ నేలంటే నాలుగు గట్ల నడుమ/ కొంత ఖాళీ జాగాయేనా/ నేలంటే పిడికెడు డబ్బులతో కొనుక్కునే/ వస్తువు మాత్రమే కాదు కదా/ నేలంటే తరతరాల స్వేద పరిమళాలు వీచే/ నా పూర్వుల రక్తమాంసాస్థికలలోంచి/ మొలుచుకొచ్చిన బతుకు చెట్టు/ నేలంటే నాగలి మొనస్పర్శతో పులకరించి/ నా తల్లి చేతిలో అరవిరిసిన బువ్వపువ్వు/ నా కూతురి పెళ్లినేల/ నా కొడుకు చదువు నేల/ నా కష్టం నేల నా సుఖం నేల/ నా కాళ్ళకు ఊనిక నేల" ఈ కవి 'దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్' అన్న మహాకవి గురజాడ వారసుడు. అందుకే నేలతల్లిని గూర్చి ఇంత అద్భుతంగా తన కవితలో పలికించాడు. "నేలను వదులుకోవడమంటే/ నేనొక వీరదాసుణ్ణి కావడం/ నేలను త్యజించడమంటే/ చర్మాని వలుచుకున్న కర్ణుడినై వొదిగిపోవడం/ నేల నాకు కాకుండా పోవడమంటే/ నా నాగలికి నేనే శిలువ వేసుకుని/ క్రీస్తునై వొరిగిపోవడం/ పరిహారాన్ని స్వీకరించడమంటే/ ఆత్మలేని దేహాన్నై వలసపోవడం" ఇంక తనకు ప్రాణత్యాగమే శరణ్యమా? అని విలపిస్తాడు. ఇలా గౌ.నా చారిత్రక, ఐతిహాసిక ప్రతీకలను వాడుతూ అభ్యుదయాన్ని కాంక్షించడం మరో మహాకవి శ్రీశ్రీని ఆవాహనం చేసుకోవడంగానే భావించాలి. సామాజికాభ్యుదయాన్ని కాంక్షించడం, సమ సమాజ స్థాపనను ఆశించడం, తద్వారా మానవవాదాన్ని ప్రతిష్ఠించం గంటేడ కవితల్లో ఉన్న ప్రత్యేకతగా పేర్కొనవచ్చు.

అనాదిగా మానవ జీవన పరిణామ క్రమంలో జనజీవనమూ, మానవ సంస్కృతి అంతా నదీ పరివాహక ప్రాంతాల్లోనే విలసిల్లింది, విస్తరించింది. 'పరోపకారార్థం వవన్తి నద్యః' అనగా, నదులు పరోపకార బుద్ధితో ప్రవహిస్తాయి. వాటిని చూసి మానవుడు నేర్చుకోవలసిన గుణాలు అనేకం. అలాంటి నదులు నేడు తమ అస్తిత్వాన్ని కోల్పోతున్నాయి. కాలుష్యభరితమై కంపు కొడుతున్నాయి. పెద్దయెత్తున ఇసుకను తవ్వడంతో నది ఉనికి ప్రశ్నార్థకమౌతున్నది. పర్యావరణ సమతుల్యత తీవ్రంగా దెబ్బతింటున్నది. ఇలాంటి తరుణంలో నదులను పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత. ప్రజాకాంక్షలకు భిన్నంగా ప్రవర్తించే పాలకులకు ముకుతాడు వేయడం మన కర్తవ్యం. గంటేడ వంటి కవి గాయకులకు ప్రజల చైతన్యమే మదావహ కారకం.

(ఆగస్టు 7న గౌరునాయుడు మాస్టారి 70వ పుట్టినరోజు)


- పిల్లా తిరుపతిరావు

70951 84846

ఈనాటి బతుకు ఆటుపోటుల 'కడలి'

తెలుగు సాహితీవనం సంస్థ మంచి సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తూ, మంచి కథా, కవితా సంకలనాల్ని ప్రచురిస్తూ, సాహితీ లోకంలో ప్రసిద్ధి పొందింది. ఇటీవల ఆ సంస్థ వెలువరించిన 'కడలి' కథా సంకలనంలో 25 కథలు ఉన్నాయి. తెలుగు కథానిక ఈనాడు విస్తారంగా బలంగా గడ్డకెక్కి రాణిస్తున్నది. వర్తమాన సమాజపు పోకడలను, పరిణామాలను, మనిషి బతుకు గీతల్లోని వంపువాటాల్నీ - కథానికలు ప్రతిబింబిస్తున్నాయి. సమాజం మనిషి మధ్యన తలెత్తుతున్న, కొనసాగుతున్న ఘర్షణల్నీ చిత్రిస్తున్నాయి. మనిషి అంతర్లోకాల్లోని సంఘర్షణల్నీ పారదర్శకం చేస్తున్నాయి. ఆ విధంగా తెలుగు కథలు ప్రభావశీలంతోనూ, ప్రతిభాశీలంగానూ పర్యాప్తి చెందుతున్నాయి.

'కడలి' సంకలనంలోని కథలన్నిటి సారాన్నీ కలిపిచూస్తే పైన చెప్పిన విశ్లేషణ దృశ్యం కనిపిస్తున్నది. 25 కథలూ వస్తుపరంగా అనంత వైవిధ్యంతో వచ్చాయి. పెద్ద చదువుతో గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ సంతోషంగా బతుకుతున్నా, ఉద్యోగం లేని వాడికి పిల్లనిస్తే ఆమెకు జీవిత భద్రత ఉండదనే మనస్తత్వం, నమ్మకం కలిగిన పెద్దలు - 'ఇప్పటికైనా మారాలి'లో (జి.వి.శ్రీనివాస్) కనిపిస్తారు. రేపటి పౌరులు ఈనాటి వ్యసనాలకు బానిసలై పోతుంటే, బాధ్యత గల ఉపాధ్యాయులు వారిని సరైన దారికి నడిపించాలనే సందేశాన్నిచ్చే టీచర్‌ని చూపుతుంది- (పురిమళ్ళ సునంద) 'ఓజోన్ పొర' కథ. ఆడపిల్లకూ పిత్రార్జితంలో ఆస్తిహక్కు వర్సెస్ కుటుంబ సంబంధాలు - పర్యవసానాలకి చిత్రణ (ఏనుగు నరసింహారెడ్డి) 'గుట్టు' కథానిక. లోన్ యాప్స్ ట్రాప్‌లో పడి చివరికి ఆత్మహత్యా ప్రయత్నం చేసుకునే యువ విద్యార్థిని (ఆచంట సుధాకళ్యాణి) 'జనులా పుత్రుని పొగడగ'లో మనముందు నిలిపారు. అనాథలైన బాలబాలికల్ని అమ్మకానికి పెట్టే, వెట్టి చాకిరీ మాఫియా దాన్నుండీ తప్పించుకుని బయటపడిన వారి కథ (వెంకట్ కంచిపాటి) 'డాటర్ ఆఫ్ కృష్ణమూర్తి'. ప్రకృతి కన్నెర్ర చేయటానికి మనిషి ఎలా కారణమవుతున్నాడో, దాన్ని నిరోధించటానికి అవసరమైన 'పాఠ్యాంశం' ఏమిటో - అదే పేరు గల కథ చెబుతుంది (అట్టాడ అప్పలనాయుడు). కార్పొరేట్ స్కూల్స్ వర్సెస్ ప్రభుత్వ పాఠశాలలు - బోధన విధానం, మార్కుల యాంత్రికత, పర్యవసానం. 'పంచప్రాణాలు' కథ (సూర్యప్రసాదరావు). మాదకద్రవ్యాల సరఫరాలో చిక్కి, బయటపడిన వాని గాథ- 'మరో బాటసారి' (కృపాకర్ పోతుల). ఆండ్రాయిడ్ - మనిషి యాంత్రిక సేవ మనిషితనాన్ని ఎలా ఛిద్రం చేస్తుందో చూపింది- 'లెఫిబో' (సలీం). యువతలో ప్రేమ, దాని నుంచి జనించే వస్తు వ్యామోహం, ఆ 'వ్యామోహం' చేసే దుందుడుకుతనం కనిపిస్తాయి- 'వ్యామోహం'లో



(అంపశయ్య నవీన్). ఇలా ఇవన్నీ ప్రస్తుత సమాజంలోని సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక విలక్షణ, విచ్ఛిన్నకర చిత్రాల్ని ఆవిష్కరించాయి.

కుటుంబ వ్యవస్థలోని కష్టసుఖాలూ, బంధుత్వాల మధ్యన ఇరుకుదనం, మనుషుల్లోని రాగద్వేషాల ఆటుపోటులూ కొన్ని కథల్లో కనిపిస్తాయి. ఇవే అంశాలు - సమాజంలోని కొన్ని వ్యవస్థల్లోనూ, స్త్రీ పురుష సంబంధాల్లోనూ చోటు చేసుకోవటాన్ని కూడా కొన్ని కథల్లో చూస్తాము. మతం - విమతం అవస్థ, కడకు నాకున్నది 'ఒకే ఒక్క జీవితం' అని రాజీ పడి రాజకీయ నాయకుడితో పెళ్ళికి సిద్ధపడింది- నాగసాకీ. ఇది సుమన ప్రణవ్ కథ. ఉప్పు కలిసిన కాఫీ నేపథ్యం 'అందమైన అబద్ధం'గా దర్శనమిస్తుంది, భార్యకు, భర్త చనిపోయిన తర్వాత! ఇది సుబ్రహ్మణ్యం వల్లూరి రచన. పెద్ద మనుషుల కురచబుద్ధితో వంచనని చవిచూసిన 'తుషిమా' ఈశ్వరచంద్రని మతాంతర వివాహం చేసుకుని ఆనందంగా దర్శనమిస్తుంది. ఇది మంగు కృష్ణకుమారి కథ. పి.సీతాగాయత్రి రచన 'మనసెరిగిన అత్తగారు' - పేరులోనే కథా వస్తువుని తెలుపుతోంది! కోడలు పట్ల తన ప్రవర్తనని మార్చుకుంది అత్త. దానికి ప్రేరణ తమ్ముడింట్లో ఆహ్లాదకర వాతావరణం. ఇష్టం అనే మాటను జీవితంలో తుడిచేసుకుని, అటు పుట్టింట, ఇటు మెట్టినింట కాలాన్ని పరుల కోసం వెచ్చించింది. వృద్ధాప్యంలో ఒంటరి దుఃఖం మిగిలింది. అప్పుడు జ్ఞానోదయమైంది. 'సెల్ఫ్‌పిటీని వదిలించుకుంది. 'సాగనీ ఈ పయనం' అని స్వావలంబనకి పూనుకుంది.. స్వాతిశ్రీపాద రచన. ఎం.సుగుణరావు కథ 'స్పర్శ' ఆఫీసు వాతావరణంలో ఇద్దరు స్త్రీల వేదన. ఒకరు యాసిడ్ దాడికి గురయి సహజ సౌందర్యాన్ని కోల్పోయిన యువతి. మరొకామె కుష్టు బాధిత మహాలక్ష్మి. స్పర్శ కోల్పోయినా, కోటి అనునయాల పెట్టుగా మిత్రురాలిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతుంది. ట్రాన్స్ జెండర్ మిత్రురాలిలో గాథ 'వాసనలేని పువ్వు'ని తిరుమలశ్రీ రాశారు. అబ్బాయిగా పుట్టి అమ్మాయిగా మారిన ఉష ఆత్మకథ.

కొన్ని కథలు భావనాశ్రితంగా 'ఫ్లాష్ స్కిట్స్'లా వస్తూ వుంటాయి. ఏదో వొక విలక్షణ సంభవం, లేదా సంఘటన కలిగించే సత్వర ప్రతి చర్య ప్రేరణ వీటికి కారణం. రచయితలు తమ పుస్తకాల్ని తామే అచ్చొత్తించుకొని, పంచుకునే సాహిత్య సందర్భం కదా - వర్తమానం. అదే 'చేరాల్సిన చోటు'. యాములపల్లి నరిసిరెడ్డి రాశారు. కోపం బుగ్గ పొంగటం, ఆ తర్వాత జ్ఞానోదయం - 'రీ ఛార్జ్' కథ. సి.సీతారాంబాబు గారి ముగింపులో 'ఎపిఫెనీ'ని చూపేరు! 'నెరవేరిన కోరిక'- అరుణ సందడి కథ. రకరకాల డ్రెస్‌ని తెప్పించుకొని, తన చిన్ననాటి కోరిక 'డాన్స్ చేయటం'ని నెరవేర్చుకుంది నానీ (నానమ్మ!) కాగా, మూడు పేజీల్లో ఒక జీవితానికి సరిపడా మానవీయ సందేశాన్ని కథాత్మకం చేసిన కథ- తన్నీరు శశికళ రాసిన 'వాళ్ళంతే'. ఈ కథ చదివి ఈమె అసాధ్యురాలు అనుకున్నాన్నేను!

ఇంతకింత అసాధ్యమైన రచనా నైపుణ్యం కల మరో మూడు కథలు ఈ 'కడలి' సంకలనాన్ని ఒక ప్రత్యేకమైన మంచి సంకలనంగా నిలిపాయి. మొదటిది : యండమూరి వీరేంద్రనాథ్ రచన 'కొండ మీది నక్షత్రాలు'! నిత్య జీవన భౌతిక వాస్తవాల్ని - ఏకంగా ఆధ్యాత్మిక, తాత్విక స్ఫురణలతో అనుసంధానం చేసి - బతుకు అర్థాన్నీ, పరమార్థాన్నీ కథాత్మకం చేశారు. కథనంలో 'అల్లిక'లోని బిగి, జిగి - ఆ రచయిత 'టచ్'ని ఆలోచనీయం చేస్తున్నది. సత్యాజీ రచన 'ఆనందమే జీవితం' అంతరార్థ కథనంతో ఒక పరిచ్ఛేదం నడిపింది. తర్వాత దాని అన్వయాన్ని సంఘటనాత్మకంగా, పాత్ర ప్రమేయంగా మంచి ఇతివృత్తాన్ని చేశారు. కడకు, ఆత్మహత్య నిరోధంతో జీవన లాలస ప్రాథమ్యాన్ని చెప్పకనే చెప్పారు. కథాశిల్పి మర్మజ్ఞులుగా, శైలీనిపుణులుగా రచయిత చాలా విశేషగుణాల్ని చూపారు. ఈ సంకలనం సంపాదకురాలు శాంతికృష్ణగారి కథ - 'మనసుతో రాయబారం'. ఉత్తమ పురుషలో సాగిన ప్రేమికురాలి కథ. ప్రేమ వైఫల్య సాఫల్యాల ఊయల తూగు- కథనమంతా నిబిడంగా నిండుకుని, భావకవిత్వ శైలితో ఆలోచనీయంగా సాగింది. చివరికి ప్రేమించిన సమీర్ - తనలాగేనే అవివాహితుడుగా మిగిలి- వచ్చి- వివాహం ప్రసక్తి తెస్తే, స్వాతి వెంటనే సమాధానం ఇవ్వదు. మనసుతో రాయబారం సాగించేపనికి పూనుకున్నదని సందేశిస్తూ ముగుస్తుంది కథ.

... ఇలా సంకలనంలోని కథలన్నిటా రచయితల సమాజ పరిశీలనా, మనుషుల మనస్తత్వ అధ్యయనం చాలా నిమగ్నతతో వారు చేసిన కృషీ కనిపిస్తున్నాయి. 25 మందికీ (చాలా ముఖ్యం) కథానికను కథానికగా రాసే ఒక అపూర్వ నైపుణి విశేషంగా ఉన్నది. ఇటీవలి చాలా కథా సంకలనాల్లో కొరవడిన కథా లక్షణాల్లో ముఖ్యమైన 'క్లుప్తత' అనే విశేషం ఇది. దీనికి ప్రముఖ కారణం - వారికి కథారచన పట్ల గల ఆరాధనా భావం, కథావారసత్వ సంపదని 'చదివిన' అనుభవంగా నేను భావిస్తున్నాను. వస్తు కేంద్రీకరణతో ఇతివృత్త పరిధిని నిర్ణయించుకోవటం, ఆ పరిధిలో పాత్రల్నీ, సంఘటనల్నీ -మననీయటం - వీరికి అబ్బిన విద్య! ఒక మంచి కథా సంకలనంగా 'కడలి' సాహిత్యంలో ఉన్నత స్థానం పొందుతుంది. రచయితలకూ, సంపాదకురాలికీ అభినందనలు.

- విహారి

98480 25600

యువతరంపై ఆశను పెంచే కవిత్వం

పుస్తకాలు

యువ కవయిత్రి ఆచంట సుధాకళ్యాణి ఇటీవల వెలువరించిన "నా మది సంతకం" కవితాసంపుటి కొత్త తరం సాహిత్య సృజనను అందిపుచ్చుకొని ముమ్మందుకు నడిపింటచంపై ఆశాభావం రెట్టింపు చేస్తోంది. ఈ కవయిత్రి చదివింది 'ఇంజనీరింగ్' అయినా, తెలుగు భాషపై ఆమెకు ఉన్న పట్టు చాలా బాగుంది. తెలుగు భాషపట్ల తన మమకారాన్ని మొదటి కవితలో చూపించారు.



"అనుబంధాల పిలుపులలో ఇంకా రవళిస్తూనే ఉన్నాను.
మనసారా మమతలను చవిచూపిస్తూ నిలిచి పోదామని"

మరో కవితలో స్వచ్ఛమైన అమ్మా నాన్నా, అత్తయ్య, మామయ్య లాంటి తెలుగు పిలుపులు, బంధాలను దగ్గర చేస్తాయని చెప్పకనే చెప్పారు. "ప్రకృతిలోని అందాలు, ఋతువులలోని మార్పులు ఒక్కో భావాన్ని సృజియిస్తూంటాయి" అంటూ "ప్రతి ఋతువూ చిత్రమే, ఆకులన్నీ ... సరికొత్తగా చిగురించటానికే"నంటూ ఆశావాద దృక్పథాన్ని ఒక కవితలో సూక్ష్మంగా అందించారు. "విరహం ప్రేమలోని మరో భావమే" అని, దానిని బహు అందంగా తన కవితలో రాస్తూ "మనసెరిగిన తోడు తిరిగొస్తున్న వేకువకై, కనురెప్పల కాగడాల వెలుతురులో నీ రాకకై" అంటూ రమ్యమైన భావాన్ని నింపారు మరో కవితలో.

బాల్యాన్ని గురించి రాస్తూ "రెప్పపాటు ప్రయాణం" అని, నాన్నను "మనసున్న మా రాజు" అని గౌరవిస్తూ, అమ్మ గురించి "ఎక్కడా ఎవరూ రాయని ప్రేమపుస్తకం" అంటూ ప్రేమను చూపుతూ అలతి అలతి పదాలతో కవితలల్లారు. మగువ గురించి "కుటుంబ క్షేత్రాన ఆప్యాయతలను సేద్యం చేస్తుంది" అంటూ "మగువ అల్లిన అనుబంధాల దండలో ప్రతి కుసుమం ఆమె చిరునవ్వే" అని కీర్తించారు. "ఇంకా పడిలేస్తున్న కెరటం" అంటూ మగువ సమాజంలో నిత్యం ఎదుర్కొనే సమస్యలను ఆవేదనతో ప్రశ్నించారు.

కరోనా నేపథ్యాన ఆమె రాసిన కవితలో "మానవత్వపు అవతారమెత్తిన తాను/ విరాట్ స్వరూపమై విలసిల్లుతాడు" అని "కరోనా మహమ్మారి విలయ తాండవం చేసిన ఆ దురదృష్టపు రోజుల్లో మానవత్వం మది నింపుకున్న డాక్టర్లు, నర్సులు, పోలీసులు, పారిశుధ్య పనివారు, వివిధ సేవాతత్పరులు చేసిన సాయాన్ని కొనియాడారు. "ఎంత అపురూపం ఈ జీవన చిత్రం" అంటూ బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం గురించి "నిలుపుకున్న బంధాలే ఉనికికి చిహ్నం" అంటూ చక్కగా చెప్పారు. జీవన ప్రయాణంలో ఎదురయ్యే సమస్యలను ఏ విధంగా ఎదుర్కోవాలో "సుఖదుఃఖాల ప్రవాహం" అనే కవితలో చెప్పారు. "ధైర్యమనే గొడుగును గట్టిగా పట్టుకో, ఓటమనే జడివాన కురుస్తూంటే" అన్నారు. ఎంత ధైర్యాన్నిచ్చే వాక్యం అది!

"ఋతువిలాసం" కవితలో "జడివానై జడిపించినా, పుడమిపై పచ్చని సంతకం వదిలి వెడుతుంది", "కుంచెనే వాడని అరుదైన చిత్రం, ప్రకృతి గీసిన ఈ ఋతుచక్రం" అంటూ తాను ప్రకృతితో మమేకమై రాసి, అద్భుతమైన భావ సౌందర్యాన్ని చిలికించారు. "నాకు మాత్రమే సొంతమన్నదేదీ మనతోనే ఉండదని, గ్రీష్మ శిశిరాలకు మల్లే వచ్చి వెళుతుండే చుట్టాలని" "ఆశల తోరణం" కవితలో చిత్రించారు. పర్యావరణం పట్ల తనకున్న బాధ్యతను "కూలనివ్వొద్దు కూర్చున్న కొమ్మని" కవితలోను, "వానకు దారి చూపు" కవితలోనూ గుర్తు చేస్తూ "ఇకనైనా భూతాపాన్ని తగ్గించుకుంటూ, వానకు నేలనింకే దారి చూపాలి" అని చక్కని సూచనలను అందించారు.

శ్రామికుల పట్ల ఆమెకున్న గౌరవాన్ని "ఆగని రథచక్రాలు" అనే కవితలో వ్యక్తపరుస్తూ "అస్తమించని సూర్యునిలా వెలిగే చైతన్యం, ప్రపంచాన్ని ఆగనివ్వక నడిపించే ఇంధనం" అంటూ శ్రమశక్తికి జేజేలు పలికారు. "కమిలిపోతున్న బాల్యం" కవిత ఆమె స్వీయానుభవంలో నుంచి మొలకెత్తిందే! తీపి బిళ్ళల డబ్బా కొనుక్కోవడానికి ఓ బాల కార్మికుడికి కాస్త సాయం చేసే అవకాశమొచ్చినపుడు, ఆ చిన్ని సాయానికే, ఆ బాలుడి కళ్ళలోని వెలుగును చూసిన అనుభవం నుండే "ఎండిపోతున్న మీ కలల నారుమడిని, మరల చిగురింపచేయాలని, చైతన్యం కలిగించే కొత్త పంట వేయాలని" అంటూ తన భావాలను వ్యక్తీకరించారు. కవిత్వాన్ని ఓ ఔషధంగా మార్చారు "కవితా సుధ" కవితలో. "కలతలను దూరం చేసే దివ్యౌషధానివా? హాయిని కురిపించు సాహిత్యపు జల్లువా!" ఎంత గొప్పగా సంభావించారు. "చరవాణి" చిన్నాపెద్దల తేడాలేకుండా ప్రతివారినీ తలదించుకునేలా చేస్తోంది. ముఖ్యంగా పిల్లలు దాని ప్రభావంలో పడి చెడిపోతున్నారన్న వేదనను "అదుపు తప్పిపోతున్న బాల్యానికి ఇప్పుడే హద్దు నేర్పాలి, రేపటి ప్రగతి పథానికి మెరుగైన మానవ వనరులుగా తీర్చి దిద్దాలి" అంటూ పెద్దలకు సలహాలనిచ్చారు. ఈ విధంగా తాను రచించిన 69 కవితలలో 'తల్లిదండ్రులు', 'పిల్లలు', 'బంధాలు', 'ప్రకతి', 'సామాజిక చైతన్యం', 'దేశభక్తి' వంటి అనేకానేక అంశాలపై సున్నితంగానే స్పందిస్తూ, నిర్మొహమాటంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. తన కొంగొత్త భావాలతో భవిష్యత్తులో మరిన్ని అంశాలతో చక్కని కవిత్వం వెలువరించాలని ఆశిద్దాం.

- ఉప్పలూరి మధుపత్ర శైలజ

70320 94260



స్మృతులు

కొన్ని పాద ముద్రలు
ఆదర్శ చరిత్ర ఆనవాళ్ళుగా నిలిచిపోతాయి
పుట్టుక మొదలు గిట్టే వరకూ
ఆటుపోటుల సంద్రంలో
ఈదులాడక తప్పదు

ప్రతి ప్రయాణంలో
మైలురాళ్ళు వున్నట్లుగా
బతుకు గమనంలోనూ ఎన్నో గీటురాళ్ళు
మన స్వచ్ఛతను లిఖిస్తుంటాయి
కదిలి పోయే కాలం వెంట
ఎన్ని స్మృతులు తచ్చాడుతాయో
ఓ ఆశయం కోసం ఆవిరైన బ్రతుకులు
అమత స్మృతుల్ని మిగిల్చి పోతాయి
భద్రంగా కూడేసుకున్న బతుకు తాలూకు
కలలు ముక్కలవ్వటం
ఎవ్వరూ తీర్చలేని వెలితి!

బాధలు ఎప్పుడూ వందశాతం గ్రంథస్థం కావు
దృశ్యాలను చూసే కళ్ళు
మనసును తోడుక్కున్నప్పుడే
స్వప్నాలు శిథిలమవ్వటం కనిపిస్తాయి

భౌతికంగానో మానసికంగానో
గాయపడ్డ ప్రాణాలు తెరిపిన పడాలంటే..
అనివార్యంగా మరుపు లేపనాలు
మళ్లీ మళ్లీ రాసుకుంటూ వుండాలి

ఎవ్వరైనా ఇప్పుడు చెయ్యాల్సింది ఒక్కటే..
హృదయ కుహరం అహరహం
కొత్తదనాలు తొడిగెట్టు
ఆనందాల్ని పోగు చేసుకోవాలి
పెద్దలు మనకు మిగిల్చి వెళ్లిన
స్మృతుల దొంతరుల నుంచి ...

- డాక్టర్ కటుకోర్ఝ్వల రమేష్
99490 83327



మనసు ధర్మం

పొద్దుకు కళ్ళు లేవనుకోకు
మంచికి ఆదరణ కరువైందనుకోకు
సత్యానికి చోటెక్కడనుకోకు
ధర్మం మూగబోయిందనుకోకు...


అబద్ధానికి ఆదరణ ఉండదు
ఉన్నా అది తేలిపోక తప్పదు
అలుపెరుగని పోరాటంలో
ఆదరణ లేదని చింతించకు...

గడప దాటిన అబద్ధానికి
ఊరు ఏకమై వత్తాసు పలికినా
బానిసల అక్కసులో
నిజాయితీ బంధించబడినా
భాస్కరుడు ఉదయించక తప్పదు...

కాలం కంటికి
మబ్బు తెరలు కమ్ముకొచ్చినా
విరజిమ్ముతున్న బడబానలాన్ని ఎవరాపును...
తొందరపడి సందెపొద్దు పరిగెత్తుకొచ్చినా
కారు చీకట్లు కమ్ముకొని
అక్కసువాదులు అంతం కాక తప్పదు...

నీ నిరాసాక్తాంధకారానికి బదులు
సమాధానం చూడక తప్పదు
రేపటి వెలుగులు నిన్ను ఆహ్వానిస్తున్నాయి
ఓసారి నీ మదిని నీవే ప్రశ్నించుకో...
ముందు మరిచిన మంచిని తెచ్చుకో...
ఆడిన అబద్ధాన్ని మళ్లీ సరిదిద్దుకో...
మనసు ధర్మం ముందు గెలిచి నడిచిపో...

- డా. చిటికెన కిరణ్ కుమార్
94908 41284



నిశిరాత్రి

హద్దులేని ఆనందము లేదు
అత్యంత గొప్పదేనా జీవితం కాదు
చిమ్మ చీకటిలో రవంతగా వెలుగు
నెర్రెలు బారిన నేలలో కన్నీటి చెమ్మలాంటి తడి
లెక్క లేనన్ని కలలు కని
రెప్పల చాటున దాచుకున్న రంగులు
బోసిపోయిన క్యాన్వాస్ మీద వొలకును రాదు
అద్భుత దృశ్యం ఆవిష్కరించును కాదు
హృదయం ఒక సావేరి రాగం
మీటిన చోటల్లా పచ్చిగాయం
నీ స్వప్నం నీది నీ దుఃఖం నీది
నా ఏకాంతం నాది
నా శూన్యం నాది
ఇద్దరి మధ్య వచ్చి వెళ్లిపోయిన వసంతం
ఇద్దరి మధ్య భ్రమలా మిగిలినకాలం
ఉంటాను మరి గోడ మీద గడియారం
పన్నెండు కొడుతుంది అర్ధరాత్రి గుర్తు చేస్తూ ...

- లోసారి సుధాకర్
99499 46991

సిపిఎస్ రద్దు కోసం ఉధృత ఉద్యమాలు

- విద్యా ప్రైవేటీకరణ కార్పొరేటీకరణకు ఎన్ఇపి ఆజ్యం
- 'టీచర్స్ భవన్' ప్రారంభోత్సవంలో ఎంపి అమ్రారామ్



టీచర్స్ భవన్ ప్రారంభోత్సవ సందర్భంగా నిర్వహించిన విద్యా సదస్సులో ప్రసంగిస్తున్న అమ్రారామ్



ఉపాధ్యాల సంఘాల ఐక్యవేదిక ఎస్‌టిఎఫ్ఐ కేంద్ర కార్యలయ నూతన భవనం ఇదే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉద్యోగ విరమణ తర్వాత ఉపాధ్యాయులకు, ప్రభుత్వ సిబ్బందికి భరోసాగా నిలిచిన పాత పింఛను స్థానంలో తీసుకొచ్చిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) రద్దు కోసం దేశవ్యాప్తంగా ఉధృత ఉద్యమాలను చేపట్టాలని రైతాంగ ఉద్యమ నాయకులు, సిపిఎం ఎంపి అమ్రారామ్ పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక 'స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్ఐ) కేంద్ర కార్యాలయం 'టీచర్స్ భవన్' ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఢిల్లీ శివారు ఫరీదాబాద్ లో నెలకొల్పిన నూతన భవనాన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కలిసి అమ్రారామ్ ప్రారంభించారు. అనంతరం ఎస్‌టిఎఫ్ఐ అధ్యక్షులు హరిక్రిష్ణన్ అధ్యక్షతన జరిగిన విద్యా సదస్సులో అమ్రారామ్ మాట్లాడుతూ ఎస్‌టిఎఫ్ఐ వ్యవస్థాపక రజతోత్సవ వేళ (25 ఏళ్లు) నూతన భవనం ప్రారంభించడం అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టే పోరాటాలకు ఇది కేంద్రంగా మారాలని ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల సేవలో తరిస్తోందని, రైతులు, కార్మికులు, మధ్యతరగతి ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు తదితరుల సమస్యల పరిష్కారం కోసం ఏమాత్రమూ కృషి చేయడం లేదని విమర్శించారు. సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేందుకు పోరాటాలను ఉధృతం చేయాలన్నారు. విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు తీసుకొచ్చిన వినాశకర ఎన్ఇపిని ప్రతిఘటించడానికి బలోపేత ఉద్యమాన్ని నిర్మించాలన్నారు. పలు రాష్ట్రాల్లో వేలాది పాఠశాలలు మూతపడుతున్నాయని, రెగ్యులర్ నియామకాలు తగ్గించి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమిస్తున్నారని, వారికి కనీస వేతనాలు ఇవ్వటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం నిర్దేశించిన స్వాతంత్య్రం, ప్రజాస్వామ్యం, లౌకిక విలువలు, సామాజిక న్యాయం గురించి విద్యార్థులకు బోధించాలన్నారు. ఉపాధ్యాయులు గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, వ్యవసాయ కార్మికులతో సత్సంబంధాలు కలిగి ఉండాలని తద్వారా ప్రభుత్వ పాఠశాలల రక్షణ కోసం ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

ప్రముఖ విద్యా వేత్త, జాయింట్ ఫోరం ఫర్ మూవ్‌మెంట్ ఆన్ ఎడ్యుకేషన్ (జెఎఫ్ఎంఇ) సమన్వయకర్త డిఎస్ లోబియాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడికి దూరంగా ఉన్న 6.2 కోట్ల మంది బడిఈడు పిల్లలను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు.

జెఎఫ్ఎంఇ చైర్ పర్సన్ నందిత నారాయణన్ మాట్లాడుతూ విద్య అనేది ప్రభుత్వ రంగంలోనే ఉండాలన్నారు. విద్యారంగం మొత్తాన్ని డిజిటలీకరణ చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంచుకునే ప్రయత్నం సరైనది కాదని, దాన్ని తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో విద్యాబోధన అనేది కార్పొరేట్ పాఠశాలలకు ఉపయోగం తప్ప గ్రామీణ ప్రాంతాలలో బడుగు బలహీన తరగతులకు అందని ద్రాక్షగా మారుతుందన్నారు. ప్రత్యక్ష విద్యాబోధన విద్యార్థి, ఉపాధ్యాయ, అధ్యాపకుల మధ్య ఉండే అవినాభావ సంబంధం బలోపేతం కావడానికి ఉపయోగపడుతుందన్నారు.

విద్యా రంగ సమస్యలపై ఐక్య ఉద్యమాలు: మయూక్ బిశ్వాస్

ఎస్ఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి మయాంక్ బిశ్వాస్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 34 శాతం ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవని, 44 శాతం పాఠశాలల్లో విద్యుదీకరణ జరగలేదని పేర్కొన్నారు. విద్యకు జిడిపిలో ఆరు శాతం నిధులను కేటాయించడానికి ఉద్యమించాలన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాల్లో వేలాది పాఠశాలలు మూతపడ్డాయన్నారు. ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.

జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్ మౌషుమి బసు, ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్ పుణ్యవతి, కార్యదర్శి ప్రొఫెసర్ అర్చనా ప్రసాద్ మాట్లాడుతూ సోషల్ మీడియాతో కేంద్రం మూఢనమ్మకాలను విస్తృతంగా వ్యాప్తి చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యా రంగంలో మహిళల ప్రోత్సాహం కీలకమన్నారు. లింగ సమానత్వం సాధించే పోరాటంలో, మహిళలు ముందుండాలన్నారు. ఈ కార్యాక్రమంలో ఎస్‌టిఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సిఎన్ భారతి, ఉపాధ్యక్షులు చావా రవి, ఆంధ్రప్రదేశ్ నుండి ఎస్‌టిఎఫ్ఐ ఉపాధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, అరుణకుమారి, కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజి శ్రీనివాసరావు, సహాధ్యక్షులు కె సురేష్ కుమార్, కుసుమ కుమారి, నాయకులు లక్ష్మీ రాజా, గోపీమూర్తి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ నుంచి కేంద్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్ దుర్గా భవాని, కె జంగయ్య, వైద్య శాంతి కుమారి, టి లక్ష్మారెడ్డి, ఎం రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

కాశ్మీర్‌లో కుండపోత

- జాతీయ రహదారి మూసివేత

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని గండేర్‌బాల్ జిల్లాలో కుండపోత వర్షాలు కురిశాయి. ఈ వర్షాల కారణంగా సంభవించిన భారీ వరదలకు ధ్వంసమైన శ్రీనగర్–లేహ్ జాతీయ రహదారి మూసివేస్తున్నట్లు అధికారులు ఆదివారం తెలిపారు. 'గండేర్‌బాల్ జిల్లాలో కచేర్వాన్ వద్ద రహదారి ధ్వంసమైన కారణంగా తదుపరి నోటీసు ఇచ్చే వరకూ శ్రీనగర్–లేహ్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిపివేస్తున్నాం' అని ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌కు చెందిన అధికారులు తెలిపారు. కుండపోతగా వర్షాల కారణంగా రహదారి ధ్వంసమయిందని చెప్పారు. ఈ వర్షాలకు నివాసగృహాలతో సహా అనేక భవనాలు దెబ్బతిన్నాయని ఒక పోలీసు అధికారి తెలిపారు. అవసరమైన వారికి సహాయం అందించడం కోసం అధికారులు క్షేత్రస్థాయిలో సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కాగా, ఈ జాతీయ రహదారి మూసివేయడంతో లదఖ్ కేంద్రపాలిత ప్రాంతానికి, కాశ్మీర్ లోయకు మధ్య సంబంధాలు తెగిపోయాయి. అలాగే, అమర్‌నాథ్ యాత్ర కోసం ఏర్పాటు చేసిన బల్తాల్ బేస్ క్యాంప్ కూడా అందుబాటులో లేకుండా పోయింది.

బడ్జెట్‌కు వ్యతిరేకంగా 8న ఆందోళన

- దళిత హక్కుల సమన్వయ కమిటీ పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇటీవల ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్ దళిత వ్యతిరేక బడ్జెట్ అని, ఈ బడ్జెట్ కు వ్యతిరేకంగా ఆగస్టు 8న దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని దళిత హక్కుల కోసం సమన్వయ కమిటీ పిలుపు ఇచ్చింది. ఈ మేరకు ఆదివారం దళిత హక్కుల కోసం సమన్వయ కమిటీ నేతలు మల్లేపల్లి లక్ష్మయ్య, ఎంపి రాధాకృష్ణన్, బి వెంకట్, విఎస్ నిర్మల్, దిరేంద్ర ఝా, రామచంద్ర డోమ్, పల్లికల్, ఎన్ సాయి బాలాజీ, గుల్జార్ సింగ్ గోరియా, విక్రమ్ సింగ్, కమెల్ సింగ్, బీనా సంయుక్తంగ ప్రకటన విడుదల చేశారు. దళితులను ఈ బడ్జెట్ పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. బడ్జెట్ కేటాయింపులు, వ్యయాలను పెంచాలని, షెడ్యూల్డ్ కులాల సబ్ ప్లాన్ (ఎస్‌సిఎస్‌పి)ని జాతీయ స్థాయిలో అమలు చేయాలని, ప్రైవేట్ రంగంలో దళితులకు రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. నీతి అయోగ్ సిఫార్సులు, దళిత జనాభా ప్రకారం షెడ్యూల్డ్ కులాలకు కేటాయింపులు బడ్జెట్‌లో దాదాపు 16.2 శాతం ఉండాలని, కానీ 11 శాతం దాటలేదని తెలిపారు. అలాగే ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరణ చేయడం ఆపాలని డిమాండ్ చేశారు.

ఒడిషాలో నిత్య పెళ్లికొడుకు అరెస్టు

భువనేశ్వర్ : ఒడిషాలో నిత్య పెళ్లికొడుకును పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జాజ్‌పూర్ జిల్లాకు చెందిన 34 ఏళ్ల సత్యజిత్ శ్యామల్ అనే వ్యక్తి పోలీసు అధికారికి చెప్పుకుంటూ ఒకరి తర్వాత ఒకరిని ఏకంగా ఐదుగురు మహిళలను వివాహం చేసుకున్నాడు. ఎవ్వరికీ విడాకాలు ఇవ్వకుండా పదేపదే పెళ్లిళ్లు చేసుకోవడమే కాకుండా మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్లలో తాను పోలీసు అధికారిని అంటూ ఘనమైన ప్రొఫైల్ మైంటైన్ చేస్తూ మోసాలు చేస్తున్నాడని, మరో 50 మందికి వివిధ సైట్ల ద్వారా ప్రపోజల్స్ పంపినట్లు పోలీసులు తెలిపారు. కట్నం కింద ఇప్పటికే రూ.లక్షలాది సొమ్ము, బంగారు నగలు కాజేశాడని తెలిపారు. ఇతగాడి వంచనపై ఇద్దరు బాధిత మహిళలకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఒక మహిళా అధికారిని పెళ్లి కుమార్తెగా రంగంలోకి దిగి ట్రాప్ చేసి మోసగాడిని అదుపులోకి తీసుకున్నారు.

పగలూ, రాత్రి తేడా లేకుండా..సహాయక చర్యలు

- నిర్విరామంగా 1000 మంది పైగా అధికారుల సేవలు



బాధిత ప్రాంతం నుంచి రక్షించిన చిన్నారులతో అటవీశాఖ అధికారులు



కోజికోడ్‌లో ట్రక్ డ్రైవర్ అర్జున్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న పినరయి విజయన్

తిరువనంతపురం : వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడిన ప్రాంతం వద్ద పగలు, రాత్రి తేడా లేకుండా 1000 మంది పైగా ప్రభుత్వ ఉద్యోగులు సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి పినరయి విజయన్ కార్యాలయం ఆదివారం వెల్లడించింది. 24 గంటలూ కార్యక్రమాలను పర్యవేక్షించడం కోసం కల్పెట్ట వద్ద సివిల్ స్టేషన్, చూరల్‌మల వద్ద తాత్కాలిక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ప్రభుత్వ సిబ్బందిని 15 బృందాలు కింద విభజించి గాలింపు, సహాయక చర్యలను సమన్వయం చేస్తున్నారు.

అలాగే సహాయక సామాగ్రి సేకరణ, పంపిణీని నిర్వహిస్తున్నారు. కౌన్సిలింగ్, పునరావాస కేంద్రాలు, సాంకేతిక బృందాల నిర్వహణ, చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితి, బాధితులు, ఇంకా ఆచూకీ తెలియని వారి సమాచారం, వ్యర్థాల తొలగింపు, డేటా నిర్వహణ వంటి ప్రక్రియలు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బృందాలు వెలికితీసిన మృతదేహాలకు సంబంధించిన విషయాలను నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. అంటే మృతదేహాల గుర్తింపు, కుటుంబ సభ్యులకు అప్పగించడం, క్లెయిమ్ చేయని మృతదేహాలను దహనం చేయడం, శవపరీక్షలకు సంబంధించిన విషయాలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. విపత్తు నిర్వహణ, రెస్క్యూ కార్యకలాపాలను నిర్వహించే ప్రభుత్వ విభాగాలు రాష్ట్ర ప్రభుత్వానికి రోజువారీ నివేదికలను అందచేస్తున్నట్లు కార్యాలయం తెలిపింది.

కొనసాగుతున్న సహాయక చర్యలు

కొండ చరియలు విరిగిపడిన ప్రాంతాల్లో సహాయక చర్యలు ఆరో రోజు అయిన ఆదివారం కూడా కొనసాగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహాయక బలగాలతో పాటు 1700 మంది రిజర్వ్ వలంటీర్లు, 188 గ్రూపులుగా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. పరంపర, నిలంబూర్‌లో మరో రెండు మృతదేహాలు సహాయక సిబ్బంది వెలికి తీశారు. నిలంబూర్‌లో ఏడు శరీర భాగాలు, సూచిపరలో ఒక శరీర భాగం లభించాయి. మెప్పాడి వద్ద గుర్తు తెలియని 8 మంది మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. ఇప్పటి వరకు లభించిన శరీర భాగాలను, మృతదేహాలను గుర్తించడానికి డిఎన్ఎ పరీక్షల కోసం రక్తనమూనాలు సేకరిస్తున్నారు. వయనాడ్ జిల్లాలో 77 సహాయ శిబిరాల్లో ప్రస్తుతం 8246 మంది ఉన్నారు. కాగా కొండచరియలు విరిగిపడిన ప్రమాదంలో 357 మంది చనిపోయినట్లుగా అనధికారిక అంచనా. అయితే ఆదివారం నాటికి 219 మంది మరణించినట్లు అధికారికంగా నిర్ధారణ అయ్యింది. 135 మృతదేహాలను వారి బంధువులకు అందించారు. 122 శరీర భాగాలను గుర్తించాల్సివుంది.

ట్రక్ డ్రైవర్ అర్జున్ కుటుంబానికి విజయన్ పరామర్శ

కర్నాటకలోని ఉత్తర కన్నడ జిల్లాలో షిరూర్‌కు సమీపంలో కొండచరియలు విరిగిపడిన ప్రమాదంలో గల్లంతైన ట్రక్ డ్రైవర్ అర్జున్ కోసం గాలింపు చర్యలు చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆదివారం హామీ ఇచ్చారు. కోజికోడ్‌లోని కన్నడిక్కల్‌లో అర్జున్ కుటుంబాన్ని ముఖ్యమంత్రి విజయన్ పరామర్శించారు. ప్రస్తుతం వయనాడ్‌లో ఆపదలో ఉన్న బాధిత కుటుంబాలకు ఇస్తున్న ప్రాధాన్యతనే ఈ కుటుంబానికి ఇస్తామని తెలిపారు. సహాయక చర్యలు వేగంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని విజయన్ హామీ ఇచ్చినట్లు అర్జున్ సోదరి అంజూ విలేకరులకు తెలిపారు. గత జులై 16న షిరూర్‌కు సమీపంలో కొండచరియలు విరిగిపడ్డంతో ట్రక్ డ్రైవర్ అర్జున్ ట్రక్‌తో సహా గంగావలి నదిలో గల్లంతైన సంగతి విదితమే.



ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా వెస్ట్ బ్యాంక్‌లో ఇటీవల నిర్వహించిన భారీ నిరసన ర్యాలీ

యుద్ధం అంచుల్లో పశ్చిమాసియా

- ఇరాన్‌ను బరిలోకి లాగుతున్న అమెరికా
- ప్రవాసీయుల భద్రతపై ఆందోళన

వాషింగ్టన్/టెహ్రాన్/ టెల్అవీవ్ : హమాస్, హిజ్బుల్లా నేతల హత్యతో పశ్చిమాసియాలోఉద్రిక్తతలు వేగంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం అ క్కడ పరిస్థితి ఎప్పుడైనా పేల డానికి సిద్ధంగా ఉన్న అగ్ని పర్వతంలా ఉందని పశ్చిమాసియా వ్యవహారాల నిపుణుడు, ఫుడాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సన్ డెగాంగ్ పేర్కొన్నారు. కాల్పుల విరమణపై ఇప్పటివరకు మిణుకుమిణుకు మంటున్న ఆశలు ఈ పరిణామాల తరువాత పూర్తిగా సన్నగిల్లాయని ఆయన అభిప్రాయపడ్డారు. హమాస్ రాజకీయ విభాగం అధిపతి హనియే హత్య తరువాత హమాస్– ఇజ్రాయిల్ వివాదం ఇరాన్– ఇజ్రాయిల్ మధ్య ఘర్షణకు దారి తీస్తోందని సన్ పేర్కొన్నారు. తమ గడ్డపై హనియేను హత్య గావించినందుకు ఇజ్రాయిల్‌కు తగిన గుణపాఠం చెబుతామని ఇరాన్ ఇప్పటికే ప్రకటించింది. పశ్చిమాసియాపై కోల్పోతున్న తన పట్టును నిలబెట్టుకోవడానికి అమెరికా దీనిని ప్రాంతీయ యుద్ధంగా మార్చాలని చూస్తోందని, ఇరాన్‌ను కవ్వించి ఈ యుద్ధంలోకి లాగడంలో ఆంతర్యం ఇదేనని సన్ అన్నారు. జులై చివరిలో పాలస్తీనాకు చెందిన 14 గ్రూపుల ప్రతినిధులను చైనా తమ దేశానికి ఆహ్వానించి వారి మధ్య సయోధ్య కుదిర్చిన కొద్ది రోజులకే హమాస్, హిజ్బుల్లా నేతల హత్య అమెరికా భౌగోళిక, రాజకీయ వ్యూహంతో సంబంధం లేదనుకోడానికి వీల్లేదని ఆయన అన్నారు. ఇరాన్ పశ్చిమాసియాలోని ఇతర మిత్ర దేశాలను కూడా సంప్రదించి ఇజ్రాయిల్‌కు దీటుగా జవాబిచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. . మరో వైపు అమెరికా అధ్యక్షుడు బైడెన్ నెతన్యాహుకు ఫోన్ చేసి ఇజ్రాయిల్‌కు తన పూర్తి మద్దతు ఉంటుందని చెప్పారు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా ఇతర పశ్చిమ దేశాలతో కూడిన కూటమి ఇరాన్, ఇజ్రాయిల్ ఘర్షణను ప్రాంతీయ యుద్ధంగా మార్చేందుకు తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ బాలిస్టిక్ క్షిపణులు, డిస్ట్రాయర్లు, క్రూయిజ్ క్షిపణులు, పలు ఫైటర్ స్క్వాడ్రన్‌లు (ఒక్కో స్క్వాడ్రన్‌లో 12 నుంచి 24 ఫైటర్ జెట్ విమానాలు ఉంటాయి), అబ్రహం లింకన్ కారియర్, యుఎస్ఎస్ థియాడర్ రూజ్‌వెల్ట్ వంటి భారీ యుద్ధ విమాన వాహక నౌకలను ఇజ్రాయిల్‌కు తరలించాలని ఆదేశించారు.

ఉద్రిక్తతలు తీవ్రతరమవుతున్న నేపథ్యంలో పశ్చిమాసియా నుంచి, ముఖ్యంగా లెబనాన్ నుంచి తమ దేశానికి చెందిన పౌరులను వెంటనే ఖాళీ చేసి ఏ విమానం దొరికితే ఆ విమానంలో వెనక్కి వచ్చేయాలని బీరుట్‌లోని తమ ఎంబసీల ద్వారా అమెరికా, బ్రిటన్, స్వీడన్, ఫ్రాన్స్, కెనడా, జోర్డాన్ అడ్వయిజరీలు పంపాయి. భారత్ కూడా ఇటువంటి అడ్వయిజరీనే జారీ చేస్తూ, బీరుట్‌లోని ఎంబసీకి టచ్‌లో ఉండాలని కోరింది. ఇప్పటికే పలు విమాన సర్వీసులు మూసివేసినప్పటికీ, కొన్ని కమర్షియల్ విమాన సర్వీసులు నడుస్తున్నందున వాటిలో వచ్చేయాలని ఆ అడ్వయిజరీలో కోరింది. పెరుగుతున్న ఉద్రిక్తతలపై ఈజిప్టు విదేశాంగ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

హనియే హత్యకు ప్రతీకార చర్య గతంలో సిరియాలోని తమ దౌత్యకార్యాలయంపై దాడికి ఇచ్చిన సమాధానం కన్నా అనేక రెట్లు అధికంగా ఉంటుందని పేరు తెలపడానికి ఇష్టపడని ఇరాన్ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. హమాస్ నేతను హత్య చేసి తప్పు చేశాం అని ఇజ్రాయిల్ చింతించేలా తమ ప్రతీకార చర్య ఉంటుందని ఆయన అన్నారు. వచ్చే 24 గంటల్లో ఎప్పుడైనా ఇరాన్ చర్య ఉందొచ్చని చెప్పారు.

హనియే హత్యకు సంబంధించి భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. టెహ్రాన్‌లోని అతిథి గృహంలో ఉన్న హనియేను బయట నుంచి ప్రయోగించిన స్వల్ప శ్రేణి ప్రొజెక్టైల్ దాడి ద్వారా హతమార్చారని ఇరాన్ దర్యాప్తులో తేలగా, జెరూసలెం పోస్ట్ దీనికి భిన్నమైన కథనాన్ని ప్రచురించింది. ఆ గెస్ట్ హౌస్‌లో జూన్‌లోనే రహస్యంగా పేలుడు పదార్థాలు అమర్చి ఉంచారని, అత్యాధునిక రిమోట్ టెక్నాలజీని ఉపయోగించి గత బుధవారం పేల్చివేశారని ఆ పత్రిక తెలిపింది.

ఉత్తర కొరియాకు రష్యా ఆపన్న హస్తం

మాస్కో : భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమవుతున్న ఉత్తర కొరియాకు మద్దతునందిస్తామని రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ హామీనిచ్చారు. గత నెల 27న రికార్డు స్థాయిలో వర్షపాతం కురిసిందని, ఫలితంగా లెక్కలేనంత మంది మరణించారని ప్యాంగాంగ్ ఈ వారం ప్రకటించింది. చైనాకు సమీపాన గల ఉత్తర సరిహద్దు ప్రాంతంలో సంభవించిన వరదలతో ఇళ్ళు, పొలాలు నీటమునిగాయి.. వర్షాలు, వరదలు సృష్టించిన బీభత్సం పట్ల పుతిన్ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. అవసరమైన సాయాన్ని అందించేందుకు ముందుకు వచ్చారు. ఉత్తర కొరియాకు తక్షణమే మానవతా సాయం అందుతుందని పుతిన్ ప్రకటించారు. దానిపై కిమ్ స్పందిస్తూ, నిజమైన మిత్రుని పట్ల ప్రత్యేక భావోద్వేగతను ప్రకటించారు. ఆపన్న హస్తం అందించినందుకు పుతిన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే అమల్లో వున్న పథకాలు, ప్రణాళికలు పని చేస్తున్నాయని చెప్పారు. సమీప భవిష్యత్తుల్లో సాయం గనక అవసరమైతే తప్పనిసరిగా మాస్కోలోని విశ్వసనీయమైన మిత్రులనే అడుగుతానని చెప్పారు.

డిజిటల్ విద్య శృతి మించితే చేటే : యునెస్కో



న్యూఢిల్లీ : పాఠశాల స్థాయిలో సాంకేతికతను అందిపుచ్చుకోవడం సానుకూల అంశమే అయినప్పటికీ దాన్ని మితిమీరి వినియోగించడం ప్రమాదకరమని ఐక్యరాజ్యసమితి విద్య, శాస్త్రీయ, సాంస్కృతిక సంస్థ (యునెస్కో) తెలిపింది. ఈ సంస్థకు చెందిన ప్రపంచ విద్యా పర్యవేక్షణ విభాగం గ్లోబల్ ఎడ్యూకేషన్ మానిటరింగ్ (జెమ్).. 'విద్యలో సాంకేతికత' అనే అంశానికి సంబంధించి ఒక నివేదిక విడుదల చతేసింది. మొబైల్ డివైజ్‌లతో ఎక్కువ సమయం గడపడం విద్యార్థి దృష్టి మరల్చుతుందని, వారి అభ్యసనపై ప్రతికూల ప్రభావం చూపిస్తుందని జెమ్ తెలిపింది. టెక్నాలజీపైనే తీవ్ర దృష్టి పెట్టడమనేది భారీ మూల్యం చెల్లించుకోవడమేనని, అభ్యసన ప్రక్రియకు అసరమైనప్పుడు మాత్రమే దాన్ని తరగతుల్లో ఉపయోగించాలని ఐక్యరాజ్యసమితి నివేదిక పేర్కొంది. ఈ క్రమంలోనే దాదాపు 14 దేశాలు పాఠశాలల్లో స్మార్ట్‌ఫోన్ల వినియోగాన్ని నిషేధించాయని తెలిపింది. 'మితిమీరిన సాంకేతికత వినియోగం, విద్యార్థుల పనితీరు మధ్య ప్రతికూల సంబంధాన్ని చూపిస్తుందని ప్రోగ్రామ్ ఫర్ ఇంటర్నేషనల్ స్టూడెంట్ అసెస్‌మెంట్ (పిఐఎస్ఎ) విశ్లేషణలో తేలింది. మొబైల్ డివైజ్‌లతో ఎక్కువ సమయం గడపడం వల్ల అభ్యసన ప్రక్రియలో ప్రతికూల ప్రభావాలు వచ్చినట్లు అనేక దేశాల నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో పాఠశాలల్లో స్మార్ట్‌ఫోన్ల వినియోగంపై ఇప్పటికే 14 దేశాలు నిషేధం విధించాయి' అని జెమ్ తన తాజా నివేదికలో పేర్కొంది. తరగతి గది, ఇంట్లో చిన్నారుల చదువులపై స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు తీవ్ర అంతరాయం కలిగిస్తాయని యునెస్కో అప్రమత్తం చేసింది.

గవర్నర్ల తీరు మారాలి

- చేయకూడని పనులు చేస్తున్నారు
- కొందరి గవర్నర్లపై సుప్రీంలోనూ కేసులు
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బివి నాగరత్న ఆక్షేపణ



బెంగళూరు : కొన్ని రాష్ట్రాల గవర్నర్లు తీసుకుంటున్న చర్యలు, తీసుకోని చర్యల పట్ల సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బివి నాగరత్న తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం గవర్నర్లకు నిర్దేశించిన తీరులో వారు వ్యవహరించడం లేదని పేర్కొన్నారు. దేశంలో నేడు కొందరు గవర్నర్లు తాము ఏ చర్యలనైతే చేపట్టరాదో ఆ చర్యలు చేపడుతున్నారు, ఏ చర్యలనైతే తీసుకోవాలో, వాటిని తీసుకోవడం లేదని, ఇది దురదృష్టకరమని ఆమె వ్యాఖ్యానించారు. బెంగళూరులో శనివారం ఎన్ఎల్ఎస్ఐయు-పిఎసిటి సమావేశంలో ఆమె ప్రసంగించారు. రాజకీయ పార్టీలకు, ముఠా రాజకీయాలకు అతీతంగా గవర్నర్ వ్యవహరించాల్సి వుందని జస్టిస్ నాగరత్న హితవు పలికారు. రాష్ట్రాల చట్టసభలు ఆమోదించిన బిల్లులకు ఆమోదం తెలియచేయకుండా గవర్నర్లు తొక్కి పట్టుతూ వ్యవహరిస్తున్న తీరు పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ సుప్రీం కోర్టులో పలు రాష్ట్రాలు పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జస్టిస్ నాగరత్న చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

సమాఖ్య స్ఫూర్తి విస్మరించరాదు ..

సమాఖ్య స్ఫూర్తిని గవర్నర్లు విస్మరించరాదని ఆమె అన్నారు. 'రాష్ట్రాల పరిధిలోని అంశాలు ప్రాధాన్యత లేనివి కావు, లేదా రాష్ట్రాలు పరాధీనంగా, లొంగి వుండాలని భావించడం సరికాదు. రాజ్యాంగబద్ధమైన రాజ నీతిజ్ఞతా స్ఫూర్తి అనేది మంత్రంగా వుండాలి కానీ పక్షపాతం కాదు' అని ఆమె స్పష్టం చేశారు. సౌభ్రాతృత్వం, సోదర భావం అనేది అర్థం కాని అంశంగా మిగిలిపోతోంది. దానిపై చర్చే జరగడం లేదు. బహుశా భారత రాజ్యాంగం ముందు పీఠికలో పేర్కొన్న నాలుగు మూల స్తంభాల్లోని ఒకటైన ఈ సౌభ్రాతృత్వం అసలు ఆచరణలో వుండడం లేదనుకోవచ్చు. దేశ సమైక్యతా భావన ఈ సోదర భావం నుండే రావడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. మన ప్రజాస్వామ్యానికి కీలకం కూడా ఇదేనని అన్నారు.

ప్రాథమిక హక్కుల రక్షణ ప్రభుత్వాల బాధ్యత

ప్రాథమిక హక్కులను సంపదగా భావించి, పరిరక్షించుకోవాలని ప్రభుత్వ సంస్థలకు, పౌర సమాజానికి నాగరత్న విజ్ఞప్తి చేశారు. చట్టం ఏర్పాటు చేసిన ప్రక్రియలను అమలు చేయడం, చట్టబద్ధ పాలనా స్ఫూర్తిని గౌరవించడం, పరస్పరం చర్చలు, సంప్రదింపులతో కూడిన నిర్ణయాక క్రమాన్ని చేపట్టడం ఈ మూడు సూత్రాలను పకడ్బందీగా అమలు చేయడం ద్వారా హక్కుల ఉల్లంఘనలను నివారించవచ్చు. మన రాజకీయ జీవితం రాజ్యాంగంలో పొందుపరిచిన లక్ష్యాల సాధనను నొక్కి చెప్పాలి. పరిణతి చెందిన ప్రజాస్వామ్యంగా మన స్థాయిని సంపాదించుకోవడానికి జరిపిన కఠినమైన పోరాటంలో మన తండ్రులు, తల్లులు లెక్కలేనని త్యాగాలు చేశారు. ప్రతీ తరం ఈ దేశాన్ని నిర్మించింది. ఇంతటి వైవిధ్యభరితమైన సమాజంలో భాగమైన మనం వ్యవస్థాపక విలువలను, సూత్రాలను పరిరక్షించుకోగలుగుతున్నామా లేదా అని ఆత్మపరిశీలన చేసుకోవాల్సి వుంది. మరింత మెరుగైన రేపటి నిర్మాణం కోసం ఇటువంటి ఆత్మపరిశోధన చర్చలకు తావు కల్పిస్తుంది. ఒక దేశంగా మనం చాలా ముందుకు పయనించినా, మన వ్యవస్థాపకుల విలువలను అందుకోవాలంటే మనం మరింత ప్రయాణం చేయాల్సి వుంది' అని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు.



జాతీయ విపత్తుపై మీనమేషాలు

- న్యాయపర అంశాలు పరిశీలిస్తున్నట్లు సురేష్ గోపి వెల్లడి
- వయనాడులో పర్యటించిన కేంద్ర సహాయ మంత్రి

తిరువనంతపురం : కేరళలోని వయనాడ్‌లో చోటుచేసుకున్న మహా విపత్తుపై దేశమంతా స్పందిస్తున్నా కేంద్రంలోని బిజెపి నేతృత్వం ఎన్‌డిఎ ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోంది. ప్రకృతి ప్రకోపానికి సర్వం కోల్పోయి వేలాది మంది నిరాశ్రయులుగా ఎదురుచూస్తున్నా కేంద్రం కనికరించడం లేదు. ఈ మహా విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఇప్పటికే కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విజ్ఞప్తి చేశారు. అయితే జాతీయ విపత్తుగా ప్రకటించాలంటే న్యాయపర అంశాలను పరిశీలించాల్సివుందని కేరళకు చెందిన బిజెపి నేత, కేంద్ర పర్యాటకశాఖ సహాయ మంత్రి సురేష్ గోపి చెప్పారు. ప్రమాద ప్రాంతంలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ కేంద్రం ఏదైనా ఒక ప్రకటన చేసే ముందు అనేక విధి విధానాలకు కట్టుబడి ఉండాల్సివుంటుందన్నారు. వయనాడ్ విపత్తుపై కేరళ ప్రభుత్వం డిమాండ్ చేస్తున్న జాతీయ విపత్తుగా ప్రకటించే అంశంపై న్యాయపర అంశాలను కేంద్రం పరిశీలిస్తోందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థించాలని సురేష్ గోపి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రమాదంలో నిరాశ్రయులైన కుటుంబాలకు వేగంగా పునరావాసం కల్పించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన తెలిపారు. భారత సైన్యం, ఎన్‌డిఆర్ఎఫ్ అధికారులతో కలిసి ప్రమాద ప్రాంతంలో సురేష్ గోపి పర్యటించారు. ఈ పర్యటన తరువాత కేరళ రాష్ట్ర ప్రజా పనుల శాఖ మంత్రి మహ్మద్ రియాజ్‌తో సురేష్ గోపి సమావేశమయ్యారు.

మధ్యప్రదేశ్‌లో విషాదం

- గోడ కూలి 9 మంది చిన్నారులు మృతి

సాగర్ : మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో ఆదివారం భారీ విషాదం చోటు చేసుకుంది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఒక పాత ఇంటి గోడ కూలి 9 మంది చిన్నారులు మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. రాష్ట్రంలో శనివారం రేవా, నార్సింగ్‌పూర్ జిల్లాల్లో రెండు వేరువేరు ఘటనల్లో గోడ కూలి ఆరుగురు చిన్నారులు మరణించిన విషాదం మర్చిపోకముందే ఒక రోజు తరువాత ఈ ప్రమాదం జరిగింది. రేహ్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని సనోధ పోలీస్ స్టేషన్ పరిధిలో షాపూర్ గ్రామంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు ఈ దారుణ ఘటన జరిగింది. 'రామ్ కథ' పేరిట గ్రామోత్సవం నిర్వహిస్తున్న సందర్భంగా ఇందుకోసం చిన్నారులు ఘటన చోటుచేసుకున్న ఇంటి వద్ద టెంట్‌లో మట్టితో శివలింగాలు తయారు చేస్తున్నారు. ఒక్కసారిగా గోడ కూలిపోయి..టెంట్ మీద పడటంతో ఇద్దరు మినహా చిన్నారులంతా అక్కడికక్కడే చనిపోయారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు చిన్నారులను ఆసుపత్రికి తరలించారు. వీరంతా 10 నుంచి 15 ఏళ్ల లోపు వయస్సున్నవారేనని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై విచారణ కొనసాగుతోందని, ఘటనకు బాధ్యులైన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని స్థానిక సబ్–డివిజనరల్ పోలీసు అధికారి ప్రకాశ్ మిశ్రా తెలిపారు.

బంగ్లాలో మళ్లీ హింస

(మొదటి పేజీ తరువాయి)

ఘర్షణల్లో 91 మంది దాకా చనిపోయారు. వీరిలో 14 మంది పోలీసులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పరిస్థితి అదుపు తప్పుతుండడంతో ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి కర్ఫ్యూ విధించారు. దేశవ్యాపితంగా అన్ని విద్యా సంస్థలకు సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. జులైలో ప్రభుత్వ ఉద్యోగాల్లో స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తలెత్తిన ఆందోళనల్లో 200 మందికిపైగా విద్యార్థులు చనిపోయిన సంగతి తెలిసిందే. ఆ తరువాత సుప్రీం కోర్టు ఆ రిజర్వేషన్లను రద్దు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. దీంతో సద్దుమణిగినట్టే మణిగిన ఆందోళన ఒక్కసారి మళ్లీ ఎగసిపడింది. ప్రధానమంత్రి హసీనా ప్రభుత్వం గద్దె దిగాలన్న డిమాండ్‌ను ఈ సారి ఆందోళనలో ముందుకొచ్చింది. జమాతే ఇస్లామిక్ మత ఛాందసవాద సంస్థ హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులను రెచ్చగొడుతోందని ప్రభుత్వం వాదిస్తోంది. కానీ, జమాతే నుంచే కాదు, ఇతర వర్గాల నుంచి కూడా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. బంగ్లాదేశ్ విమోచన కోసం పోరాడిన ఉద్యమ .పార్టీ ఇప్పుడు ప్రజల నుంచి ఇంతటి వ్యతిరేకత ఎదుర్కోవడానికి కారణమేమిటో లోతుగా పరిశీలించాల్సిన అవసరముందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. అక్కడ నివసిస్తున్న భారతీయ పౌరులను ఇళ్ల నుంచి బయటకు రావద్దని ఢాకాలోని భారత కాన్సులేట్ కార్యాలయం అడ్వయిజరీ జారీ చేసింది. వారి కోసం హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేసింది.

పాడవోయి...భారతీయుడా...

సినిమా అంటే కేవలం వినోదం మాత్రమే కాదు. అప్పుడప్పుడూ చరిత్రనూ చెబుతుంది. స్వాతంత్ర్య సమరయోధుల గాథల్ని వివరిస్తుంది. దేశభక్తిని రగిలిస్తుంది. సినీ పరిశ్రమ చాలా సంవత్సరాలుగా అనేక దేశభక్తి చిత్రాలను విడుదల చేసింది. చిత్ర నిర్మాతలు స్ఫూర్తిని పెంపొందించ టానికి, దేశం పట్ల భారతీయులను గర్వించే భావాన్ని నింపడానికి తమవంతుగా ప్రయత్నించారు. దేశభక్తిని ప్రబోధించే సినిమాలు తీయటం ద్వారా కూడా దేశం పట్ల తమ ప్రేమను ప్రదర్శిస్తున్నారు. నాటి బ్లాక్ అండ్ వైట్ నుంచి నేటి సిల్వర్ స్క్రీన్‌పై ఎంతోమంది నటులు స్వాతంత్ర్య సమరయోధుల పాత్రల్లో నటించి మెప్పించారు. వారిపై చిత్రీకరించిన పాటలతో పాటు దేశభక్తిని రగిలించిన అనేక పాటలున్నాయ్. వాటిని ఓసారి మననం చేసుకుందాం.

మన భారతదేశం తెల్లదొరల బానిస సంకెళ్ల నుండి విముక్తి పొంది నేటికి 78 ఏళ్లు పూర్తయ్యాయి. తెలుగు చిత్రసీమలో అలనాటి ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, కృష్ణంరాజు, శోభన్‌బాబుల కాలం నుండి మోహన్‌బాబు, చిరంజీవి, బాలకృష్ణ, పవన్‌కళ్యాణ్; నాగార్జున, వెంకటేష్, జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్, మహేష్‌బాబు, అల్లు అర్జున్ తదితరుల వరకు స్వాతంత్ర్యోద్యమ పోరాట విశిష్టతను, దేశభక్తిని, స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను, వారి వీరత్వాన్ని వివరించే అజరామర దేశభక్తి గీతాలు చాలా ఉన్నాయి. ప్రజల్లో ముఖ్యంగా యువతలో స్వాతంత్ర్యోదమ స్ఫూర్తిని, పోరాట ప్రతిమను నింపే పాటలు ప్రముఖ పాత్ర వహిస్తాయి. ఆ తెలుగు పాటలు ఎన్ని తరాలు మారినా ప్రతి భారతీయుడిలోనూ దేశభక్తిని రగిలిస్తూనే ఉంటాయి.



'పాడవోయి భారతీయుడా.. ఆడి పాడవోయి విజయ గీతికా' అంటూ మహాకవి శ్రీశ్రీ రాసిన దేశభక్తి గీతం ప్రతి యేడాది స్వాతంత్ర్య దినోత్సవం రోజున మార్మోగుతూనే ఉంటుంది. అక్కినేని నాగేశ్వరరావు నటించిన 'వెలుగు నీడలు' చిత్రంకోసం పి.సుశీల, ఘంటసాల ఆలపించారు. నేటికీ దేశభక్తి గీతాల్లో తొలిస్థానం ఈ పాటకే దక్కుతుంది. ఎన్టీఆర్ నటించిన 'బడిపంతులు' చిత్రంలోని 'భారతమాతకు జేజేలు బంగరు భూమికి జేజేలు' అనే పాట ప్రతిచోటా ప్రతిధ్వనిస్తుంది. ఆచార్య ఆత్రేయ రచించిన ఈ దేశభక్తి గీతం ఘంటసాల గాత్రంలో వీనుల విందు చేస్తుంది.

'గాంధీ పుట్టిన దేశం' చిత్రంలోని 'గాంధీపుట్టిన దేశం రఘురాముడు ఏలిన రాజ్యం' అనే పాట మన దేశ విశిష్టతను గుర్తుచేస్తుంది. మ్యాలవరపు గోపి రాసిన ఈ పాటకు ఎస్‌పి.కోదండపాణి సంగీతం, పి.సుశీల గాత్రం మైమరపిస్తాయి. తెలుగువారి విప్లవజ్యోతి 'అల్లూరి సీతారామరాజు' వీరత్వాన్ని తెలిపే గీతం 'తెలుగు వీర లేవరా దీక్షపూని సాగరా' పాట వింటుంటే ప్రతి భారతీయుడిలో దేశభక్తి ఉప్పొంగుతుంది. తెల్లదొరను తరిమి కొట్టిన సీతారామరాజు పౌరుషం ప్రతి తెలుగువాడిని తట్టిలేపుతుంది. అమెరికా అబ్బాయి చిత్రంలోని 'ఏ దేశమేగినా ఎందు కాలిడినా' అనే పాట మన దేశ ఔన్నత్యాన్ని చాటిచెబుతుంది.

90వ దశకంలో వచ్చిన పాట 'పుణ్యభూమి నాదేశం నమో నమామి'. ఎన్టీఆర్ నటించిన 'మేజర్ చంద్రకాంత్' చిత్రంలోని ఈ పాట దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఎందరో వీరుల త్యాగాలను గుర్తుచేస్తుంది. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆలపించిన ఈపాటకు కీరవాణి అద్భుత స్వరాలు సమకూర్చారు. రోజా చిత్రంలో 'వినరా వినరా దేశం మనదేరా', రెహమాన్ పాడిన 'మా తుఝే సలాం', దేశభక్తి కథతో వచ్చిన ఖడ్గం చిత్రంలోని 'మేమే ఇండియన్స్', జై చిత్రంలోని 'దేశం మనదే', బద్రి చిత్రంలోని 'ఐయామ్ ఇండియన్' పాటలు ప్రజల హృదయాల్లోని దేశభక్తిని మేల్కొల్పుతాయి.

1986లో రాక్షసుడు సినిమాలో 'జయ జయ ప్రియ భారత జనయిత్రీ'...దేశాన్ని తల్లిగా కీర్తిస్తూ దేవులపల్లి కృష్ణశాస్త్రి రాసిన గీతం ఉర్రూత లూగిస్తుంది. 195లో వచ్చిన 'బొంబాయి' సినిమాలోని 'మతమేల గతమేల మనసున్నవాడు' వేటూరు సుందర రామ్మూర్తి రాయగా, ఎఆర్ రెహ్మాన్ సంగీత సారథ్యంలో హరిహరన్ పాడగా హృద్యంగా సాగుతుంది. 2002లో వచ్చిన 'బాబీ'లో 'ఈ జెండా పసిబోసి చిరునవ్వురా' పాట జాతీయజెండా గొప్పతనాన్ని చెబుతుంది.. 2007లో వచ్చిన 'శంకర్ దాదా జిందాబాద్'లో 'ఓ బాపు నువ్వే రావాలి' అంటూ సాగే పాటను సుద్దాల అశోక్‌తేజ రాశారు. 2010లో వచ్చిన 'ఝుమ్మంది నాదం' సినిమాలో 'దేశమంటే' పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించారు. రోజా, ది లెజెండ్ భగత్‌సింగ్, మేజర్, ఉరి, మణికర్ణిక తదితర చిత్రాల్లో కూడా దేశభక్తిని చాటే పాటలున్నాయి. 1936లో వచ్చిన 'ప్రేమవిజయం' సినిమాలోనూ స్వాతంత్ర్య కాంక్ష కనిపిస్తుంది. ఆ తర్వాత వచ్చిన 'మాలపిల్ల', 'మళ్ళీ పెళ్లి', 'రైతుబిడ్డ', 'వందేమాతరం', 'సుమంగళి', 'దేవత' తదితర చిత్రాల్లో దేశభక్తి అంశాలు సాహిత్యపరంగా కనిపిస్తాయి. 'బొబ్బిలియుద్ధం', 'తాండ్ర పాపారాయుడు', 'సర్దార్ పాపారాయుడు', 'మేమూ మనుషులమే', 'నాడు-నేడు' తదితర చిత్రాలు కూడా స్వాంత్ర్య పోరాట నేపథ్యంలో సాగినవే. భారతీయుడు-1,2, మహాత్ముడు, సీతారామం, సైరా నరసింహారెడ్డి, ఆర్ఆర్ఆర్, ఒక్కడే వీరుడు అల్లూరి సీతారామరాజు తదితర సినిమాలు కూడా ఇదే కోవలో సాగాయి. దేశభక్తిని రగిలించే పాటలు ఎన్నో ఉన్నాయి. ప్రతి భారతీయుడి మదిలో నిలిచిపోయాయి.

ఒలింపిక్ సెమీస్‌లో హాకీ ఇండియా

క్వార్టర్‌ఫైనల్లో బ్రిటన్‌పై ఘన విజయం

షూటౌట్‌లో 4-2తో భారత్ జయకేతనం

పారిస్ 2024 ఒలింపిక్స్





పారిస్ : ఒలింపిక్స్‌లో హాకీ ఇండియా దూసుకెళ్తోంది. మూడేండ్ల కిందట టోక్యో ఒలింపిక్స్ ప్రదర్శనను పునరావృతం చేసింది. ఆదివారం జరిగిన హాకీ క్వార్టర్‌ఫైనల్లో అగ్ర జట్టు గ్రేట్ బ్రిటన్‌పై మెరుపు విజయం సాధించి.. పారిస్ ఒలింపిక్స్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. నిర్ణీత 60 నిమిషాల ఆటలో గ్రేట్ బ్రిటన్, భారత్‌లు 1-1తో సమవుజ్జీలుగా నిలిచాయి. దీంతో మ్యాచ్ ఫలితాన్ని షూటౌట్‌లో నిర్ణయించారు. ఉత్కంఠగా సాగిన షూటౌట్‌లో భారత్ నుంచి వరుసగా నలుగురు ఆటగాళ్లు గోల్స్ నమోదు చేయగా.. గ్రేట్ బ్రిటన్ నుంచి తొలుత ఇద్దరు గోల్స్ కొట్టారు. ఆ తర్వాత రెండు గోల్ ప్రయత్నాలను దిగ్గజ గోల్ కీపర్ పీఆర్ శ్రీజేష్ సమర్థవంతంగా నిలువరించాడు. దీంతో 4-2తో భారత్ ఘన విజయం సాధించింది. ఆట 17వ నిమిషంలో స్టార్ డిఫెండర్ అమిత్ రోహిదాస్‌కు రెడ్ కార్డ్ ఇవ్వటంతో.. అక్కడ్నుంచి భారత్ పది మంది ఆటగాళ్లతోనే పోటీపడింది. గ్రేట్ బ్రిటన్‌పై గ్రేట్ విజయాన్ని అందుకుంది.

సూపర్ షో : భారత్, గ్రేట్ బ్రిటన్ క్వార్టర్‌ఫైనల్లో.. హాకీ ఇండియా ఫేవరేట్‌గా బరిలోకి దిగింది. టోక్యో ఒలింపిక్స్‌లో బ్రిటన్‌ను చిత్తు చేసిన ఉత్సాహంతో హర్మన్‌ప్రీత్ సేన ఉత్సాహంగా కనిపించింది. ఊహించినట్టుగానే బంతి నియంత్రణలో బ్రిటన్ పైచేయి సాధించింది. 54 శాతం బ్రిటన్ నియంత్రణలో ఉండగా.. భారత్ 46 శాతమే నియంత్రణలో ఉంచుకుంది. ఎదురుదాడికి బ్రిటన్ పెట్టింది పేరు. కానీ భారత డిఫెన్స్ గత 20 ఏండ్లలో ఎరుగని ప్రదర్శనతో కదం తొక్కింది. బ్రిటన్ ఏకంగా 21 సార్లు భారత గోల్‌పోస్ట్‌పై దాడి చేసింది. కానీ గోల్ కీపర్ శ్రీజేష్ గోడ కట్టాడు. భారత్ మాత్రం ఎనిమిది పర్యాయాలు మాత్రమే బ్రిటన్ గోల్ పోస్ట్‌పై దాడి చేసింది. ఈ క్రమంలో రెండు జట్లు చెరో సారి విజయవంతం అయ్యాయి.



ఆట తొలి 15 నిమిషాల్లోనే గోల్ ప్రయత్నాలు జరిగినా.. ఆట సమతూకంగా నిలిచింది. రెండో క్వార్టర్‌లో ఆట ఊహించని మలుపులు తిరిగింది. 17వ నిమిషంలో డిఫెండర్ అమిత్ రోహిదాస్ రెడ్ కార్డ్ శిక్షకు గురయ్యాడు. దీంతో ఆ తర్వాతి నుంచి భారత్ పది మంది ఆటగాళ్లతోనే ఆడింది. 22వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను గుర్జంత్ సింగ్ సద్వినియోగం చేసుకోలేదు. కానీ అదే నిమిషంలో లభించిన మరో పెనాల్టీ కార్నర్‌ను హర్మన్‌ప్రీత్ సింగ్ గోల్‌గా మలిచాడు. దీంతో 22వ నిమిషంలో భారత్ 1-0తో ముందంజ వేసింది. కానీ బ్రిటన్ ఎంతోసేపు వెనుకంజలో నిలువలేదు. 27వ నిమిషంలో మోర్టాన్ లీ ఫీల్డ్ గోల్‌తో స్కోరు సమం చేశాడు. ప్రథమార్థం ఆట ముగిసే సమయానికి భారత్, బ్రిటన్ 1-1తో సమవుజ్జీగా నిలిచాయి.

స్టార్ డిఫెండర్ అమిత్ రోహిదాస్ లేని వేళ సహజంగానే గ్రేట్ బ్రిటన్ ఎదురుదాడిలో పస పెంచింది. ఈ సమయంలో భారత్ ఎటాకింగ్‌ను వదిలేసి పూర్తిగా రక్షణ శ్రేణిపై దృష్టి నిలిపింది. సీనియర్ మిడ్ ఫీల్డర్ మన్‌ప్రీత్ సింగ్ డిఫెన్స్‌లోకి వచ్చాడు. సెంటర్ బ్యాక్‌గా నిలిచాడు. సుమిత్, హర్మన్‌ప్రీత్ సింగ్, జర్మన్‌ప్రీత్ సింగ్‌లు సైతం డిఫెన్స్‌లో చేరాడు. వీళ్లందరి వెనుక.. శ్రీజేష్ గోడలా నిలబడ్డాడు. బ్రిటన్ ఆటగాళ్ల గోల్ ప్రయత్నాలను శ్రీజేష్ గొప్పగా నిలువరించాడు. మిడ్‌ఫీల్డ్‌లో సుమిత్‌ను బ్రిటన్ లక్ష్యంగా చేసుకుంది. అతడి సైడ్ పిచ్‌పై దాడి చేయటం మొదలుపెట్టింది. కానీ సుమిత్ బ్రిటన్ ట్రాప్‌లో పడకుండా.. ప్రతిసారి చక్కగా ప్రతిస్పందించాడు. హార్దిక్ సింగ్, అభిషేక్, సుఖజిత్ సింగ్, లలిత్ కుమార్ ఉపాధ్యాయ్‌లు సైతం డిఫెన్స్‌లో భాగం పంచుకున్నారు. అద్భుత ప్రదర్శనతో 60 నిమిషాల ఆటలో గ్రేట్ బ్రిటన్‌ను నిలువరించినా.. అక్కడితో పని పూర్తి కాలేదు.

హీరో.. శ్రీజేష్ : గ్రేట్ బ్రిటన్‌తో క్వార్టర్‌ఫైనల్లో భారత డిఫెన్స్ అమోఘం. డిఫెన్స్ నాయకుడు శ్రీజేష్ ఈ విజయంలో హీరో. కెరీర్ చివరి టోర్నమెంట్‌లో ఆడుతున్న శ్రీజేష్.. గోల్ పోస్ట్ ముందు వంద శాతం ప్రదర్శన ఇస్తున్నాడు. మ్యాచ్ షూటౌట్‌లోకి వెళ్లగా.. శ్రీజేష్ భారత్‌ను విజేతగా నిలిపాడు. తొలి రెండు ప్రయత్నాల్లో అల్బరీ జేమ్స్, జాక్‌లు గోల్స్ కొట్టారు. కానీ ఆ తర్వాత వరుసగా విలియమ్సన్ కానర్, రాఫర్ ఫిలిప్‌లను అడ్డుకుని భారత్‌ను విజయ సంబురాల్లో ముంచెత్తాడు. షూటౌట్‌లో భారత్ తరపున హర్మన్‌ప్రీత్ సింగ్, సుఖజిత్ సింగ్, లలిత్ కుమార్ ఉపాధ్యాయ్, రాజ్‌కుమార్ పాల్‌లు గోల్స్ కొట్టారు.

పోరాడి ఓడిన లక్ష్యసేన్

బ్యాడ్మింటన్‌లో పతక ఆశలు రేపిన యువ షట్లర్ లక్ష్యసేన్ సెమీఫైనల్లో పోరాడి ఓడాడు. టాప్ సీడ్, డిఫెండింగ్ ఒలింపిక్ చాంపియన్ విక్టర్ అక్సెల్సెన్ (డెన్మార్క్)తో సెమీస్ పోరులో లక్ష్యసేన్ వరుస గేముల్లో ఓటమి చెందాడు. 54 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో 20-22, 14-21తో పరాజయం పాలయ్యాడు. ఉత్కంఠగా సాగిన తొలి గేమ్‌లో లక్ష్యసేన్ పట్టు విడువలేదు. ఆఖరు వరకు విక్టర్‌ను వెంటాడాడు. కానీ రెండో గేమ్‌లో చాంపియన్ విక్టర్ తన క్లాస్ చూపించాడు. మెన్స్ సింగిల్స్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. సెమీస్‌లో ఓడినా.. లక్ష్యసేన్ మెడల్ రేసులోనే నిలిచాడు. మరో సెమీఫైనల్లో పరాజయం పాలైన మలేషియా ఆటగాడు జియా లీతో కాంస్య పతక మ్యాచ్‌లో పోటీపడనున్నాడు. ఇదిలా ఉండగా, బాక్సింగ్‌లో భారత పతక వేటకు తెర పడింది. టోక్యో ఒలింపిక్ మెడలిస్ట్ లవ్లీనా బొర్గొహైన్ క్వార్టర్‌ఫైనల్లో ఓటమి చెందింది. క్వార్టర్‌ఫైనల్లో విజయంతో లవ్లీనా కనీసం కాంస్యం ఖాయం చేసుకునేది. కానీ చైనా బాక్సర్ లి క్వియన్ చేతిలో లవ్లీనా ఓటమి చెందింది.



శ్రీలంకతో రెండో వన్డేలో

టీమిండియా ఓటమి

కొలంబో: శ్రీలంకతో తొలి వన్డేలో విజయాన్ని వదులుకుని.. టైగా ముగించిన టీమిండియా రెండో వన్డేలోనూ తడబడింది. ఆదివారం జరిగిన రెండో వన్డేలో భారత్‌పై శ్రీలంక 32 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో రోహిత్ సేన 42.2 ఓవర్లలో 208 పరుగులకు ఆలౌటైంది. రోహిత్ శర్మ (64 రన్స్) 44 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు, వరుసగా రెండో అర్ధ శతకం సాధించగా.. శుభ్‌మన్ గిల్ (35 పరుగులు.. 44 బంతుల్లో 3 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ (44 రన్స్). 44 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. మిగతా బ్యాటర్లు చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. శ్రీలంక వెటరన్ స్పిన్నర్ జెఫ్రి వాండర్సే (6/33) భారత్ పతనాన్ని శాసించాడు. ఈ ఓటమితో మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 0-1తో వెనుకంజలో ఉంది. బుధవారం (ఆగస్టు 7న) సిరీస్ నిర్ణయాత్మక మూడో వన్డే జరగనుంది. ఇందులో భారత్ గెలిస్తే సిరీస్ 1-1తో సమం అవుతుంది.





మీకోసం

పిల్లలకు కాల్షియం సమృద్ధిగా అందాలంటే ప్రతిరోజూ ఉదయం అర చెంచా, సాయంత్రం అర చెంచా నువ్వులను నమిలి తినేలా అలవాటు చేయాలి. నువ్వుండలు తిన్నా మంచిదే.

జీవన సౌరభం

వేచి వుంటే అవకాశాలు వస్తాయి. కాని అవి దూసుకుపోయే వాళ్లు వదిలేసినవి.

JEEVANA జీవన the family


రిటర్న్ గిఫ్ట్



అలకాపురి అనే ఊరిలో ఆరుష్ అనే విద్యార్థి ఉన్నాడు. ఆ ఊరి బయట మర్రిచెట్టు మీద కాకి, కోతి ఉంటున్నాయి. ఒక రోజున వేసవి సెలవుల్లో ఆరుష్ చుట్టాల ఊరికి వెళుతుండగా ఎండ వేడికి తట్టుకోలేక మర్రి చెట్టుమీద నుండి కాకి కిందపడింది. అది గమనించిన ఆరుష్ తన దగ్గర ఉన్న వాటర్ బాటిల్‌లోని నీటిని దానికి తాగించాడు. కాకి కళ్ళు తెరిచి మెల్లగా లేచి ఎగిరిపోయింది. కొద్దిరోజుల తర్వాత ఆరుష్ ఊరు తిరిగి వచ్చాడు. అప్పుడప్పుడు తన స్నేహితులతో కలిసి ఆడుకోవడానికి చెట్టు దగ్గరికి వెళ్తున్నాడు. ఒక రోజు అప్పుడే బయట నుండి వచ్చిన కాకి, ఆడుకుంటున్న ఆరుష్‌ని గుర్తుపట్టింది. ఎక్కడలేని సంతోషంతో తన దగ్గరికి వెళ్లి కావ్ కావ్ మని అరిచింది. ఆరుష్‌కి మొదట ఆ కాకి అలా ఎందుకు అరుస్తుందో అర్థం కాలేదు. ఆ తరువాత బహుశా గతంలో తాను సహాయం చేసిన కాకి ఇదే కాబోలు అని దాన్ని ప్రేమగా నిమిరాడు. తన జేబులో ఉన్న చలువ అద్దాలను కూడా దానికి గిఫ్టుగా ఇచ్చాడు. ఇలా ప్రతి రోజూ ఆరుష్ చెట్టు దగ్గరకి వెళ్లడం, కాకి కిందకి దిగడం చూస్తున్న అతని స్నేహితులు 'అరే నీకు భలే మంచి స్నేహితుడు దొరికాడురా' అని ఆట పట్టించేవారు.

ఒకరోజు ఆరుష్ ఇంట్లో దొంగలు పడ్డారు. బంగారు గొలుసును కాజేశారు. దొంగలు మర్రి చెట్టు కింద చిన్న గుంట తీసి ఆ గొలుసును పాతి పెట్టారు. ఇదంతా చెట్టు పైన ఉన్న కాకి గమనించింది. తన స్నేహితుడైన కోతికి చెప్పింది. కోతి గబగబా చెట్టు దిగి ఆ గొయ్యిని తవ్వి గొలుసును కాకికి ఇచ్చింది. దొంగతనం జరిగిన ఇల్లు తనకు సహాయపడిన ఆరుష్‌ది అని తెలుసుకున్న కాకి, ఆ గొలుసును ఆరుష్ ఇంటికెళ్లి ఇచ్చింది. ఎప్పుడో తను చేసిన చిన్నపాటి సహాయానికి కాకి తిరిగి తనకు సహాయం చేయడం రిటర్న్ గిఫ్ట్ ఇచ్చినట్లుగా ఆరుష్ భావించాడు. కాకి సహాయానికి ఇంటిల్లిపాదీ ఆశ్చర్యపోయారు. ఆనందపడ్డారు.

- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి,
94415 61655.




లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న పండ్ల బొమ్మలను అంకెలుగా గణించి లెక్కచేశాం. చివరి వరుస సమాధానం మీరు రాబట్టండి చూద్దాం.

జవాబు : 10

నేను గీసిన బొమ్మ



జోగ నవ్యశ్రీ,
4వ తరగతి,
ఎంపీపీఎస్
గొంపవానిపాలెం,
కె.కోటపాడు మండలం,
అనకాపల్లి జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

రంగస్థల నాయకులు

నాటకం సమాజ జీవన చిత్రణం. మానవ జీవితానికి దర్పణం. మనిషి జీవన సురాగం. మనిషిని పెద్దగా చూపించేది సినిమా అయితే, అదే మనిషిని చిన్నగా చూపించేది టీవి. కానీ, మనిషిని మనిషిగా చూపించేది నాటకం మాత్రమే. మనిషిని అంధకారం నుంచి వెలుగు వైపు నడిపిస్తుంది. సామాజిక ప్రయోజనమే నాటక పరమార్థం. ఈ లక్ష్య సాధన స్ఫూర్తితోనే పోలుదాసు రంగనాయకులు రంగస్థల, టివి, సినిమా ఆర్టిస్టుగా రాణిస్తున్నారు.



ఎన్‌టిఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెలగలేరు గ్రామానికి చెందిన వ్యవసాయ కుటుంబంలో పోలుదాసు శాయన్న, రామలక్ష్మి దంపతులకు రంగనాయకులు జన్మించారు. డిగ్రీవరకూ చదివిన ఆయన చిన్నప్పటి నుంచి నాటకరంగంపై ఆసక్తి పెంచుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా జి కొండూరు మండలం వెలగలేరు శ్రీ చనమోలు పకీర్రాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థి దశలోనే నాటక రంగం పట్ల మక్కువతో డిఎన్ మల్లేశ్వరరావు ప్రోత్సాహంతో, శిక్షణలో ఎనిమిదవ తరగతి చదివే సమయంలో స్కూలు వార్షికోత్సవానికి జంధ్యాల గారి 'గుండెలు మార్చబడును' నాటికలో మొదటిసారి నటించారు. ఆ తర్వాత వీసం నరసింహారావు, కొల్లి నాగేశ్వరరావు ప్రోత్సాహంతో గత కొన్నేళ్లుగా పాఠశాల వార్షికోత్సవాల్లో 'సినిమా పిచ్చోళ్ళు','వార్షికోత్సవాలు', 'రేపేంది' నాటికలు ప్రదర్శించారు. విజయవాడ సయ్యద్ అప్పలస్వామి కళాశాల (ఎస్ఎఎస్)లో డ్రమెటిక్ అసోసియేషన్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. అప్పట్లో కాలేజీ వార్షికోత్సవంలో కళాశాల స్థాయి పోటీల్లో 'శవాలపై జీవాలు', 'కైలాసంలో కోర్టు', 'పద్మవ్యూహం' వంటి నాటిక ప్రదర్శనలు ఇచ్చి బహుమతులు గెల్చుకున్నారు.

పాత్రల్లో లీనమైపోతారు

ఎక్కడ నాటక పోటీలు జరిగినా అక్కడికి వెళ్లి పాల్గొనేవారు రంగనాయకులు. గత రెండు దశాబ్దాలుగా ఆయన అనేక నాటికలు, నాటకాల్లో పాల్గొని అనేక పాత్రలను పోషించి మెప్పిస్తున్నారు. ఏ పాత్రలోనైనా ఇట్టే ఒదిగేపోయే స్వభావం ఆయనది. ఆహార్యం..అభినయంలో అందెవేసిన చేయి. దీంతో ఏ పాత్ర చేసినా అందులో జీవిస్తారు.

శ్రమైక జీవన సంస్కృతికి ప్రతిబింబం

ఆదర్శ గ్రామీణ సాంస్కృతిక సేవా సంస్థను స్థాపించి అనేక రకాలైన సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. జాతీయ నాయకుల వర్థంతులు, జయంతుల కార్యక్రమాలు నిర్వహించటం, సంక్రాంతి సంబరాలు, ఉగాది ఉత్సవాలు, మహిళా దినోత్సవాలు వంటివి నిర్వహిస్తూ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించటానికి తనవంతుగా కృషి చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కళలకు మరింత ప్రాచుర్యం తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో 'నాటకోత్సవాలు' వెలగలేరులో నిర్వహిస్తున్నారు. పండుగలు, ఆచార వ్యవహారాలు, ఆత్మీయతను పెంచేలా సాంస్కృతిక సంబరాలను ఏటేటా నిర్వహిస్తున్నారు. భిన్నత్వంలోని ఏకత్వానికి అద్దం పడుతూ ప్రజల ఆచార సాంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచేలా వాటిని ఏర్పాటు చేస్తున్నారు.

వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ పేరుతో...

మంచి నటుడిగా రాణించాలనేదే లక్ష్యం



నటుడిగా నాటకరంగంలోనూ, సినిమా రంగంలోనూ మరిన్ని మంచి పాత్రలు పోషిస్తూ సమాజానికి మంచి సందేశం అందించాలనేదే నా లక్ష్యం. ఇప్పటికే నేను నటించిన సినిమాల్లో నా పాత్రకు మంచి పేరొచ్చింది. రాబోయే రోజుల్లో మరిన్ని సినిమాలు చేయటం ద్వారా సమాజానికి మంచి సందేశాన్ని ఇవ్వటానికి నా వంతుగా ప్రయత్నం చేస్తా. మంచిగా నటించి మంచి నటుడిగా గుర్తింపు పొందాలని ఉంది.

- పోలుదాసు రంగనాయకులు
రంగస్థల, టివి, సినిమా క్యారెక్టర్ ఆర్టిస్ట్

వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ తరపున రాష్ట్రస్థాయి పోటీల్లో నంది నాటకోత్సవాల్లో సొంతంగా నాటికలు తయారు చేసుకుని పాల్గొంటున్నారు. ప్రస్తుతం గంగోత్రి సాయి దర్శకత్వ నిర్వహణలోని అరవింద ఆర్ట్స్- తాడేపల్లి (గుంటూరు జిల్లా) తరపున ఏటేటా విభిన్నమైన నాటికలతో ప్రత్యేకమైన పాత్రలు పోషిస్తూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని పరిషత్‌లలో, నంది నాటకోత్సవాల్లో పాల్గొంటూ బహుమతులు అందుకుంటున్నారు. భువనేశ్వర్‌లో ఫిబ్రవరి 2021లో జరిగిన బహుభాషా నాటకోత్సవాల్లో 'మధుపర్కాలు' తెలుగు నాటిక ఎంపికై ప్రదర్శింపబడింది. ఇందులో నటించిన మిగతా వారితోపాటుగా రంగనాయకులు నటించిన 'పాపయ్య' పాత్ర బాగా మెప్పించింది. అక్కడి ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు.

నటించిన నాటికలు : 'తన వరకు వస్తే'లో కానిస్టేబుల్ గానూ, 'ఎవరికి ఎవరు'లో తండ్రిగా, 'సందడే సందడిలో' దొంగగా, 'సరిగమలులో' ఆఫీసర్‌గా, 'స్వర్గానికి వంతెనలో' ముస్లిం పెద్దగా, 'ఊరు మనదిలో' గ్రామ పెద్దగా, 'స్వచ్ఛాంధ్ర'లో తాగుబోతుగా, 'జరుగుతున్న కథలో' శంకరయ్యగా, 'మనస్విని'లో ఇంటి అల్లుడుగా, 'ఒహో..ఒహోలో' రైతుగా విభిన్నమైన పాత్రలు పోషించారు. 'మృత్యువుతో ముఖాముఖి', 'పరిణామక్రమణం', 'సత్యహరిశ్చంద్ర', 'ఇంటింటి భాగోతం', 'దాడి' నాటకాల్లో వివిధ పాత్రలు పోషించారు.

టీవీ సీరియళ్లు : షార్ట్ ఫిల్మ్స్, టెలీ ఫిల్మ్స్‌తోపాటుగా 15 టీవీ సీరియళ్లలో నటించారు. జెమినీ టీవీలో ప్రసారమైన 'మొగలిరేకులు' సీరియల్‌లో ఐజి స్వామిగా నటించినందుకు మంచి పేరొచ్చింది. వీటిలో చేస్తుండగా సినిమాల్లో అవకాశాలొచ్చాయి.

సినిమాలు : 'రణస్థలి'లో డాబా హోటల్ యజమానిగా, రాజధాని ఫైల్స్‌లో విద్యార్థి తండ్రిగా, 'వ్యూహం'లో రైతుగా, కృష్ణమ్మలో మినిస్టర్ పీఏగా విభిన్నమైన పాత్రలతో చిత్రాల్లో నటించారు. ఆయన నటించిన ధర్మచక్రం, 143 ఎఎం చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. డాక్టర్ విశ్వామిత్ర సినిమాలో ఆయన నటిస్తున్నారు.



బహుమతులు

- పరుచూరి రఘుబాబు నాటక పోటీల్లో 'మధు పర్కాలు' నాటికలో పాపయ్య పాత్ర ద్వారా బెస్ట్ క్యారెక్టర్ యాక్టర్‌గా అవార్డు
- అక్కినేని నాగేశ్వరరావు కళాపరిషత్ ద్వారా ఉత్తమ హాస్యనటుడిగా పురస్కారం
- వైకే నాగేశ్వరావు కళా అవార్డు- విజయవాడ హర్ష క్రియేషన్స్ వారు ఉత్తమ కళాకారుడిగా సత్కారం
- కొలంకపురి కళాపరిషత్ కొలకలూరు (గుంటూరు జిల్లా) ఉత్తమ కళా సంస్థ నిర్వాహకుడిగా అభినందన సత్కారం
- పలు నాటికల్లో వేర్వేరు పాత్రలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అనేక పరిషత్తుల నుంచి పలు అవార్డులు, పురస్కారాలు, బహుమతులు. నిర్వాహకుడిగా అభినందన సత్కారాలు

- యడవల్లి శ్రీనివాసరావు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68